RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



15 మే 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:297

# కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో

## పౌర సేవలు, అనుమతుల మంజూరు వంటి అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో చేపట్టే వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన పౌర సేవలు, అనుమతుల ప్రక్రియ సరళంగా, సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందుకు సంబంధించి సమగ్ర అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పౌర సేవలు, అనుమతుల మంజూరు వంటి అంశాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే ప్లాట్‌ఫామ్‌పై దరఖాస్తు చేసుకుని సింగిల్ విండోలో అనుమతి లభించేలా వ్యవస్థ ఉండాలని ఆదేశించారు.

ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆయా శాఖలు వసూలు చేసే బిల్లులు సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానానికి రూపకల్పన జరగాలన్నారు. వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని ఆయా విభాగాల ఖాతాల్లో జమయ్యే విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని, మరింత సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం జరగరాదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే వివరాలను దరఖాస్తుదారుడి తెలియజేసి వాటి పరిష్కారానికి మార్గాలను కూడా అధికారులే సూచించాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోషామహల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ లో కార్యకర్తలలో ఉత్సాహం పెరిగింది:అబ్బర్వర్ వినోద్‌కుమార్

## పార్టీ నియమావళి ప్రకారం అందరికిన్యాయంజరుగుతుంది: పార్టీ ఇంఛార్జ్ మొగిలి సునీత







గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి: గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ సమావేశం గాంధీభవన్‌లో అబ్బర్వర్ వినోద్‌కుమార్ ఇంఛార్జ్ మొగిలి సునీత పర్యావేక్షణలో నిర్వహించడం జరిగింది. గోషామహల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ లో కనివిని ఎరుగని విధంగా కార్యకర్తలలో ఉత్సాహం పెరిగింది.బిబ్లాక్ కాంగ్రెస్ పార్టీ మూడు డివిజన్‌లకు గాను పోటీపడి అబ్బర్వర్ వినోద్‌కుమార్ కు తమకు కావల్సిన పదవుల కొరకు వినతిపత్రాలు అందజేసినారు.వినతి పత్రాలు స్వీకరించిన అబ్బర్వర్ వినోద్‌కుమార్‌మాట్లాడుతూ మీ వినతి పత్రాలు పరిశీలించి , గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గంలో పర్యటించడం జరుగుతుంది.అనంతరం ఒక నివేదిక తయారు చేసి అదిష్ఠానానికి సమర్పించడం జరుగుతుంది.పార్టీ నియమావళి ప్రకారం అందరికి న్యాయం చేయడం జరుగుతుంది అని అన్నారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి రాంశెట్టి నరేందర్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్ ,బి బ్లాక్ ప్రెసిడెంట్ శ్యామ్‌సింగ్ గోషామహల్ కన్‌టెస్టెడ్ కార్పోరేటర్ కన్నయ్యలాల్ గోషామహల్ మాజీ కార్పోరేటర్ పరమేశ్వరిసింగ్ , ,నర్మాదాసింగ్, కైలాస్‌సింగ్ , బద్రి,ఇస్మాయిల్,ఆశోక్

# చీరకట్టులో రామప్ప, వేయిస్తంభాల గుడిని సందర్శించిన ముద్దుగుమ్మలు





హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి మే 14 రామప్ప, వేయిస్తంభాల ఆలయాలను సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు - మిస్ వరల్డ్ పోటీదారులకు ఘనస్వాగతం పలికిన అధికారులు - భారత సంప్రదాయ చీరకట్టులో సందర్శించిన విదేశీ భామలు

కాకతీయుల కళా వైభవానికి ప్రపంచ ముద్దుగుమ్మలు ఫిదా అయ్యారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా ఓరుగల్లుకు చేరుకున్న అందాల భామలు రామప్ప, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. చూపుతిప్పనివ్వని రామప్ప శిల్పాల హొయలకు ముగ్ధలయ్యారు. వేయి స్తంభాల ఆలయమంతా కలియ తిరిగిన సుందరీమణులు నిర్మాణ నైపుణ్యానికి ఆశ్చర్యపోయారు. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ముద్దుగుమ్మలు ఇరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

"తెలంగాణ జరూర్ ఆనా" పేరుతో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. పర్యాటకుల స్వర్గధామంగా పిలుచుకునే ఓరుగల్లు వైభవాన్ని ప్రపంచ సుందరీమణులు ఆస్వాదిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా 57 మంది ముద్దుగుమ్మలు వరంగల్‌కు చేరుకున్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో దిగిన అందగత్తెలకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మహిళలు బతుకమ్మలు, మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు.నృత్య ప్రదర్శనలతో ఘనస్వాగతం : మిస్ వరల్డ్ పోటీదారుల్లోని ఓ బృందం ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శించింది. గిరిజన సంప్రదాయ కొమ్ముకోయ నృత్యాల ప్రదర్శనలతో అధికార యంత్రాంగం స్వాగతం పలికింది. చీరకట్టులో ఆలయానికి వచ్చిన ముద్దుగుమ్మల హొయలొలికే రామప్ప శిల్ప సౌందర్యానికి ముగ్ధులయ్యారు. శతాబ్దాలు దాటినా చెక్కుచెదరకుండా సాండ్ బాక్స్ టెక్నాలజీతో నిర్మితమైన రామప్ప ఆలయ ప్రత్యేకతను తెలుసుకున్నారు. నీటిలో తేలియాడే ఇటుకలను స్వయంగా చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నంది చెవిలో తమ కోరికలు ప్రత్యేక పూజలు చేసి రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మరో బృందం హనుమకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించింది. ఆలయం ముందున్న నంది వద్ద అందరూ కలిసి ఫోటోషూట్ నిర్వహించారు. నంది చెవిలో తమ కోరికలు చెప్పుకున్న సుందరీమణులు వేయి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.కాకతీయుల కళా వైభవంతో పాటు పేరిణి, గుస్సాడీ, కూచిపూడి నృత్యాలను మిస్‌వరల్డ్ పోటీదారులు తిలకిస్తున్నారు. కళ్లు చెదిరే లేజర్ షో, లైటింగ్ షోలను వీక్షించనున్నారు. అనంతరం హరిత హోటల్‌లో చేయి తిరిగిన చెఫ్‌లు చేసిన తెలంగాణ ప్రత్యేక వంటకాలను ఆస్వాదించనున్నారు. సుందరాంగుల పర్యటన దృష్ట్యా పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.బతుకమ్మలు, మేళ తాళాలతో ఆహ్వానం : ప్రపంచ దేశాల ముద్దుగుమ్మలు చారిత్రక నగరి ఓరుగల్లుకు చేరుకున్నారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా 57 మంది సుందరాంగులు వరంగల్‌కు విచ్చేశారు. 2 బృందాలుగా విడిపోయి రామప్ప ఆలయం, వరంగల్ కోటను సందర్శిస్తున్నారు. హనుమకొండ హరిత హోటల్‌లో దిగిన అందగత్తెలకు కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మహిళలు బతుకమ్మలు, మేళ తాళాలతో ఆహ్వానం పలికారు.ఓరుగల్లు చారిత్రక వైభవంతో పాటు పేరిణి, గుస్సాడీ, కూచిపూడి నృత్యాలను మిస్ వరల్డ్ పోటీదారులు తిలకించనున్నారు. కళ్లు చెదిరే లేజర్ షో, లైటింగ్ షో లతో పాటు చేయి తిరిగిన చెఫ్‌లు చేసిన తెలంగాణ ప్రత్యేక వంటకాలను ఆస్వాదించనున్నారు. సుందరాంగుల పర్యటన దృష్ట్యా పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ మర్యాద పూర్వకంగా తెలంగాణ సెక్రటేరియట్ లో బుధవారం సాయంత్రం కలిశారు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జి హెచ్ ఎం సి నిధులు మంజూరు చేసినందుకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు

ప్రజాబలం

15 మే 2025 గురువారం

# ఫ్రీ ట్రేడ్ భారత్‌కు నష్టదాయకం

అమెరికా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కోరుతున్నది, మోడీ ప్రభుత్వం అందుకు సిద్ధపడింది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ ఇప్పటికే చర్చలు జరిపి వెళ్లారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ ద్వైపాక్షిక ఒప్పందంలో వ్యవసాయాన్ని మినహాయించేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఫ్రీ ట్రేడ్ ఒప్పందం జరిగితే, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులన్నీ సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవలసి ఉంటుంది. పాలు, పాల పొడి, సోయా బీన్స్, కాఫీ, మొక్కజొన్న, గోధుమలు, బియ్యం, పప్పులు, నూనె గింజలు, పత్తి, ఎథనాల్ దిగుమతులలో ఉంటాయి. జన్యు మార్పిడి విత్తనాలు, పండ్లు, కూరగాయలు, ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలు దిగుమతులు అవుతాయి. ఎరువులు, డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీలు తగ్గించాలని కూడా అమెరికా కోరుతున్నది. అమెరికాలో బ్లూ బాక్స్, అంబర్ బాక్స్, గ్రీన్ బాక్స్‌ల పేరుతో రైతులకు వ్యవసాయ పెట్టుబడులలో 50 శాతం వరకు సబ్సిడీలు ఇస్తారు. మన ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు అన్నీ కలిపి 3 శాతం మించి లేవు. అందువల్ల మన పంటల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ. ఎరువులు, డీజిల్‌పై సబ్సిడీలు తగ్గిస్తే మన పంటల ఉత్పత్తి ఖర్చులు మరింత పెరుగుతాయి. 50 శాతం సబ్సిడీలు పొందుతున్న అమెరికా రైతులతో హీనమైన సబ్సిడీలు పొందుతూ పంటలు పండిస్తున్న మన రైతులు పోటీ పడాల్సి వస్తుంది. అది సాధ్యం అయ్యేది కాదు, ఈ పోటీలో మన పంటలు ధరలు పడిపోయి మన రైతులు దివాళా తీయడం తప్ప వేరే మార్గం ఉండదు. విదేశీ, స్వదేశీ కంపెనీలు, ఎగుమతి, దిగుమతి వ్యాపారులు కుమ్మక్కై ధరలు తెగ కోసి లాభాలు గడించడానికి ఉపయోగపడుతుంది.

మన ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలన్నది అమెరికా విధిస్తున్న మరొక షరతు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాల నిమిత్తం ప్రభుత్వం కొనుగోలు చేసి నిల్వ ఉంచుతుంది. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు ఉండడానికి, కొంతవరకు వ్యాపారులు మార్కెట్ రేట్లు తెగ్గోయడానికి వీలు లేకుండా ఉంది. ప్రభుత్వ సంస్థలు కొనుగోలు బాధ్యత నుండి తప్పుకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి రద్దు చేసింది. ప్రభుత్వ సంస్థలు కొనుగోళ్ళు చేయడం లేదు. ఫలితంగా ఈ ఏడాది రైతులు పండిస్తున్న మన పంటల ధరలన్నీ పడిపోయాయి. మిర్చి, పొగాకు, ధాన్యం, మినుములు, పత్తి, జీడి పిక్కలు, కోకో గింజల ధరలు గత ఏడాదికన్నా సగానికి సగం తగ్గించుకోవడం, లేదా అసలు కొనకపోవడం చూస్తున్నాము. అగ్రిమెంట్ రాకముందే ఇలా ఉంటే అగ్రిమెంట్ వస్తే ఎలా ఉంటుందో ఊహించాలంటేనే పరిస్థితి భయానకంగా ఉంది. అమెరికా కంపెనీలపై వ్యాజ్యాలు వేసే విధానం రద్దు చేయాలన్నది అగ్రిమెంట్‌లో అమెరికా కోరుతున్న మరొక షరతు. ఇప్పటికే బహుళజాతి కంపెనీలకు లొంగిన భారత ప్రభుత్వం విత్తన చట్టాన్ని పక్కన పెట్టింది. ప్రత్తి పంటకు మాత్రమే ఉన్నది. నాసిరకం విత్తనాల వల్ల రైతులు నష్టపోతే కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ అవకాశం ఉండగానే కంపెనీలు కోర్టు తీర్పులకు సైతం లెక్కచేయకుండా రైతులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా చేస్తే కంపెనీల ఇష్టారాజ్యం అవుతుంది. నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారకాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తాయి.

కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం విడుదల చేసింది. పత్రం విడుదల చేసిన 15 రోజుల లోపల అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని చెప్పింది. ఈ పత్రాన్ని పరిశీలిస్తే రెండు అంశాలు స్పష్టం అవుతున్నాయి. 2020లో అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాల స్థానంలో కార్పొరేట్ల దోపిడీకి అనుకూలమైన విధానాలను దొడ్డి దారిన అమలుకు పూనుకోవడం. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలు మన వ్యవసాయ మార్కెట్లలో స్వేచ్ఛగా ప్రవేశించి అయిన కాడికి మన రైతాంగాన్ని దోపిడీ చేయడం. ఇప్పుడున్న మార్కెట్ చట్టానికి 12 సవరణలు చేసింది. సవరణలు అన్నీ విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ శక్తులు, ఎగుమతి దిగుమతి వ్యాపారులు మన వ్యవసాయ మార్కెట్లలో స్వేచ్ఛగా జొరబడి మన రైతులను దోపిడీ చేయడానికి వీలు కల్పించేవే. ఎగుమతి దిగుమతి దారులు, ప్రాసెసింగ్ కంపెనీలు మనకున్న సంస్థగత మార్కెట్ యార్డులు, ఎఫ్‌సిఐ, సిడబ్ల్యూసి, వేర్‌హౌసింగ్ గోడౌన్లను స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి వీలు కల్పించేవే. ఇప్పటికే 2 లక్షల టన్నులు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లు అదానికి అప్పగించారు. ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదు. రైతులు తమ పంటలను కంపెనీల, వ్యాపార వర్గాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అమ్ముకోవాల్సి రావడం తప్ప గత్యంతరం ఉండదు. ప్రభుత్వ ఏజెన్సీలేవీ మార్కెట్లో కొనుగోలు చేయవు. ఈ విధానాలు రద్దు చేసిన చట్టాల కన్నా మరింత ప్రమాదకరమైనవి.

సరళీకరణ విధానాల పుణ్యమా అని వ్యవసాయ రంగం సంక్షోభానికి గురైంది. రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు లేకుండా పోయాయి. ఫలితంగా రైతాంగం రుణగ్రస్తులయ్యారు. మద్దతు ధరల కన్నా తక్కువకు అమ్మడం, కొనడం వలన రైతాంగం ఏటా రూ.2 లక్షల కోట్లు కోల్పోతున్నారని అంచనా. దేశంలో రైతు సంఘాలు చేసిన పోరాట ఫలితంగా డా౹౹ స్వామినాథన్ కమిషన్ ఏర్పడింది. స్వామినాథన్ కమిషన్ వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి అనేక విలువైన సూచనలు చేసింది. ఆ సూచనలలో అత్యంత కీలకమైనది రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం. స్వామినాథన్ సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి పంటల ధరలు నిర్ణయించాలని, ఆ ధరల అమలుకు పటిష్టమైన చట్టం చేయాలని సూచించారు. దానిని సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాగా పేర్కొన్నారు. దేశంలోని రైతు సంఘాలు సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా అమలు కోసం, రైతు రుణ విముక్తి కోసం పోరాటం సాగించిన క్రమంలో బిజెపి ఎన్నికలలో అమలుకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక మోసగించింది. రైతులు కోరుతున్న చట్టాలకు మారుగా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మూడు నల్ల చట్టాలను తెచ్చింది. 13 మాసాల రైతాంగ పోరాట ఫలితంగా అవి రద్దయ్యాయి. ఆ సందర్భంగా రైతు సంఘాలకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కార్పొరేట్ అనుకూలమైన విధానాలతో వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం రూపొందించింది. బిజెపి ప్రభుత్వం భారత రైతాంగానికి ద్రోహం చేసింది. వ్యవసాయ రంగాన్ని విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం. దానితో పాటు మొత్తం మన వ్యవసాయ రంగాన్ని అదాని, అంబానీలకు, సింజెంటా, పైనీర్, కార్గిల్, బేయర్, డూపాంట్ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి సిద్ధం అవుతుంది. 'ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్, వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం' అమలైతే మన వ్యవసాయ రంగాన్ని బహుళజాతి కంపెనీల కబంధ హస్తాలకు అప్పగించడమే. నల్లచట్టాలను విధానం రద్దు చేయడం కోసం గతంలో 13 నెలలు పోరాడి ఎలా రద్దు చేయించుకున్నామో సి2 ప్లస్ 50 ధరల కోసం, రుణ విమోచన చట్టం కోసం అంతకన్నా మిన్నగా పోరాడాల్సిన అవసరం ఉంది. అందుకుగాను రైతాంగం, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు సన్నాహం కావాల్సి ఉంది.

# ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 14 : జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, వార్షిక ఫలితాలలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటర్మీడియట్ విద్యపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎస్.ఎస్.సి. ఉత్తీర్ణులైన తరువాత విద్యార్థులకు సరైన మార్గదర్శకం చేయాలని, విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ. ఇతర రంగాలలో రాణించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. జూనియర్ కళాశాలలతో పాటు ఐ.టి.ఐ.లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని, కళాశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని తెలిపారు. జిల్లాలోని కోటపల్లి, జైపూర్, దండేపల్లి తాండూర్ మండలాలలో నూతన వసతి గృహాలు మంజూరు అయ్యాయని, జిల్లాలో విద్యార్థులు కళాశాలల్లో చేర్పించేందుకు సంబంధిత అధికారులు, అధ్యాపకుల బృందం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కళాశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపించాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలు-2025లో 11 వేల 767 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 62.43 శాతంతో 7 వేల 347 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, గత ఫలితాలతో పోల్చితే ఉత్తీర్ణత శాతం మెరుగుపడిందని, వచ్చే సప్లమెంటరీ పరీక్షలకు మరింత ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 2 వేల 22 మంది, ద్వితీయ సంవత్సరంలో 1 వేయి 980 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, 2025-26 సంవత్సరలో అదనంగా 30 శాతం విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. ఇందులో భాగంగా జూనియర్ లెక్చరర్లతో బృందాలు ఏర్పాటు చేసి వారి పరిధిలోని పాఠశాలలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవగాహన కల్పించి కళాశాలలో చేర్పించాలని తెలిపారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అన్ని జూనియర్ కళాశాలలు 2025-26 సంవత్సరంలో మున్సిపల్ కార్పొరేషన్ /మున్సిపాలిటీ / గ్రామపంచాయతీ లచే జారీ చేయబడిన ఫైర్ సేఫ్టీ, సానిటరీ సర్టిఫికెట్, స్ట్రక్చరల్ సేఫ్టీ-సౌండ్నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, చెన్నూర్, బెల్లంపల్లి(బాలుర, బాలికల), జైపూర్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1 లక్షా 77 వేల రూపాయల వ్యయంతో 95 అగ్ని నిరోధక వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వసతి గృహాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయాన్ని సందర్శిస్తున్న అందాల భామలు



హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి వరంగల్,మే14 మిస్‌వరల్డ్ 2025 పోటీలు హైదరాబాద్?లో ఈనెల 10 న నుంచి ప్రారంభమయ్యాయి. పోటీలు ప్రారంభమైన మొదటి నుంచి తెలంగాణ అందాలు, హైదరాబాద్? వంటకాలకు ఫిదా అయిపోతున్నారు. ఇవాళ వరంగల్? జిల్లాలో మిస్? వరల్డ్? పోటీదారులు పర్యటిస్తున్నారు. ప్రపంచ సుందరీమణుల పర్యటనకు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లను చేసింది. అందాల భామలు రెండు బృందాలు విభజించి వరంగల్? జిల్లాలో పర్యటిస్తున్నారు. వేయిస్తంభాల గుడి, వరంగల్? కోట, రామప్ప దేవాలయం సందర్శిస్తున్నారు. పేరిణి, గుస్సాడి, కూచిపూడి నృత్యాలను సుందరీమణులు వీక్షిస్తున్నారు. లేజర్? షో, లైటింగ్? షోలను మిస్? వరల్డ్? పోటీదారులు తిలకిస్తున్నారు. సుందరీమణుల పర్యటన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేసింది. మంగళవారం హైదరాబాద్?లోని చార్మినార్?లో అందాల భామలు హెరిటేజ్? వాక్? చేశారు. అక్కడి నుంచి చౌమొహల్లా ప్యాలెస్? అందాలను తిలకించారు. సాయంత్రం అక్కడే సీఎం రేవంత్?రెడ్డి, గవర్నర్?, ప్రముఖులు విందులో పాల్గొన్నారు. ప్రస్తుతం ఒక బృందం రామప్ప దేవాలయాన్ని సందర్శించింది

# ప్రతి ఇంటికి వేళల్లో సంక్షేమ పథకాలు

**ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కల తో సహా త్వరలో వెల్లడిస్తాం**

**ఇల్లు ఇస్తామని టిఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాలు మోసం చేశారు**

**౨-రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం**





రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం ఇలా ప్రతి ఇంటికి వేళల్లో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గము ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కల తో సహా త్వరలో వెల్లడిస్తాం అన్నారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే పదేళ్లు పాలించిన వారు రాష్ట్రాన్ని గాలికి వదిలేసారు, 7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారు. ఆదాయం లేకపోయినా, అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద సంఖ్యలో ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖకు 11,600 కోట్లు ఖర్చు పెడుతున్నాము రాబోయే రోజుల్లో వైద్య రంగానికి మరింత నిధులు కేటాయిస్తాం అన్నారు. ఇల్లు ఇస్తామని టిఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాలపాటు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం అన్నారు. మొదటి సంవత్సరం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇల్లు నిర్మిస్తున్నామని, ఇ 0దుకు 22,500 కోట్లు కేటాయించాం అన్నారు. అడవి హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరా గిరి జలవికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంప్ సెట్లు, సోలార్ విద్యుత్తు, పామ్ ఆయిల్, అవకాడో మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. అందులో భాగంగా మొదటి సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు 21 వేల కోట్ల పుట్టి లేనివాడు అందజేశాం అన్నారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి వారందరికీ 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. గతంలో పెద్ద రోగం వస్తే ఇల్లు వాకిలి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది అన్నారు. రాజు ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచాం, ఆధారంగా కొత్త చికిత్సలను చేర్చాం రాష్ట్ర ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న పెద్ద భరోసా ఇది అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి వందరోజుల పని కల్పిస్తున్నాం, అదే కుటుంబంలో పిల్లలు చదువుకునేందుకు ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించారు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తాం అన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి 11,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పిల్లలు చదువుకుంటే వారి ఫీజు రియంబర్స్మెంట్ చేస్తున్నాం అన్నారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నాం అన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 2 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కలిగిస్తున్నాం అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి ఇప్పటికే 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం, మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నాం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు 9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రారంభించామని, జూన్ 2న సాంక్షన్ లెటర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ప్రయోజనం చేకూరుతుందనీ డిప్యూటీ సీఎం అన్నారు.

# గృహమే కదా స్వర్గసీమ

శాస్త్రసాంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి వేసింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. మరమనుషులు పుట్టుకొచ్చారు. విశాల భావనలు కురుచనైపోయాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోయి, చిట్టి న్యూక్లియర్ కుటుంబాలు మొలుచుకొస్తున్నాయి. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతలు, పెద్ద నాన్న, పెద్దమ్మ, పిన్ని, బాహాయ్‌ల బంధాలు బలహీనపడుతున్నాయి. 'వన్ ఆర్ నన్' సూత్రాన్ని కుటుంబ నియంత్రణ యంత్రాంగం నేర్పింది. కుటుంబం చిన్నదై, మనసులు కురుచనైపోయాయి. నేటితరం నెట్టిట్లో ఒంటరి సంసారాలు చేస్తున్నది. ఒక్కగానొక్క సంతానమని అతి ముద్దు చేసి గారాబం చేస్తూ, ఒంటరి పక్షుల వలె పంజరంలో పెట్టి పెంచుతున్నాం. ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధాలు, త్యాగాలు, కలిమిలేముల భావనలు, పరస్పర సహకార భావనలు, దయ కరుణలు బిత్తరపోయా చూస్తున్నాయి. కుటుంబ విలువలు తగ్గి అరాచక పోకడలు పెరుగుతున్నాయి. జీవనశైలిలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. అమ్మనాన్నలు, పిల్లల మధ్య కూడా వాణిజ్య బంధాలు పుట్టుకొస్తున్నాయి. జీవన గమనం వేగం పుంజుకుంది. తెలియని దానిని పొందడానికి ప్రయాసలు పెరుగుతున్నాయి. విలువలకు తూట్లు పొడుస్తూ కొత్త పోకడలు మొలుస్తున్నాయి. కుటుంబ భావనలు తరిగిపోయి అశాంతి జనిస్తున్నది.

కుటుంబమే ప్రథమ పాఠశాల, అమ్మనాన్నలే తొలి గురువులుగా లేత వయస్సు నుంచే వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పాలి. జాతి నిర్మాణంలో కుటుంబ విలువలే పునాదులు. సామాజిక, ఆర్థిక ప్రగతిలో కుటుంబ సభ్యుల భూమిక ప్రధానమైంది. కష్టనష్టాలను అధిగమించే 'షాక్ అబ్జార్బర్'లుగా కుటుంబాలు నిలవాలి. సంపదలతో మాత్రమే సంతోషాలు రావని, త్యాగాలతో కూడిన ప్రేమానురాగాలే అసలైన ఆనందాల నిధులని తెలుసుకోవాలి. మానవాళి మనుగడకు కుటుంబమే ప్రధాన యూనిట్. పౌర సమాజానికి కేంద్ర బిందువు కుటుంబం మాత్రమే. కుటుంబ భావనలకు భారత్ ప్రధాన కేంద్రం అయ్యింది. భార్యాభర్తలు, తమ సంతానం, నాన్నమ్మ, తాతలతో కూడిన కుటుంబం ఓ అద్భుత విశ్వవిద్యాలయం. దైనందిన జీవితంలో కుటుంబం మాత్రమే సుఖదుఃఖాలను తట్టుకోవడం నేర్పుతుంది. కుటుంబ విలువలే జాతికి ఊపిరిగా నిలుస్తాయి. జాతి సంస్కృతి వారసత్వాలకు పునాదులు కుటుంబాలు అని తెలుసుకొని కుటుంబ వ్యవస్థలను గౌరవిద్దాం. గృహం అంటే గోడలు – గదులు కావని, ప్రేమలతో కట్టుకున్న గోడలతో కూడి అందమైన, ఆనందాల హరివిల్లు అని తెలుసుకోవాలి.

పౌర సమాజ క్రమశిక్షణకు పునాదులుగా నిలుస్తున్న కుటుంబాల ప్రాధాన్యాలను వివరించడానికి 1993లో ఐరాస నిర్ణయాన్ని ఆధారంగా సాలీనా ప్రతి ఏట 15 మే రోజున "అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ ఫ్యామిలీ డే" పాటించుట 1994 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ బంధాలు పటిష్టమైనపుడు విశ్వశాంతి నెలకొంటూ, సమాజాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. పౌర సమాజానికి గుండెకాయ కుటుంబం మాత్రమే. కుటుంబంలోనే మానవీయ విలువలు ప్రారంభం అవుతాయి. సమస్యలకు పరిష్కార వేదికలుగా కుటుంబాలు నిలుస్తున్నాయి. సఖ్యత కొరవడిన కుటుంబాల ప్రభావం పౌర సమాజ సంక్షేమంపై నేరుగా పడుతుంది. పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగాలు కుటుంబ శాంతిని హరించి వేస్తాయి.

కుటుంబ సమస్యలకు సామాజిక, ఆర్థిక, సాంకేతికత, పట్టణీకరణ, వలసలు, వాతావరణ మార్పుల ప్రభావాలు పడుతున్నాయి. అంతర్జాత కుటుంబ దినోత్సవం–2025 ఇతివృత్తంగా "కుటుంబం : సుస్థిరాభివృద్ధి దిశగా ప్రణాళికలు" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ప్రేమ, పరస్పర గౌరవం, వివేకం, పరస్పర సహకారం లాంటివి కుటుంబాలను ఏకం చేస్తున్నాయి. దాదాపు 80 శాతం కుటుంబాలు వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల్లో ఉంటున్నాయి. కుటుంబాలతో వ్యవసాయానికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. సుస్థిర సాగు పద్ధతులు పాటించిన కుటుంబాలు పర్యావరణ పరిరక్షకులుగా నిలుస్తారు. కుటుంబ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధులు, కార్బన్ ఉద్గారాలు, ప్రతికూల వాతావరణ మార్పులు, పేదరికం లాంటి అంశాలు కుటుంబ శ్రేయస్సుకు పునాదులుగా నిలుస్తాయి. అల్ప ఆదాయ దేశాల ప్రజల జీవనోపాధులు సహజ ప్రకృతి వనరులపై మాత్రమే ఆధారపడడంతో రేపటి తరం శ్రేయస్సు గాల్లో దీపంగా మారుతోంది. నిన్నటి తరం చేయలేని పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో కనీసం నేటితరం కుటుంబాలు నడుం బిగించాలి. కుటుంబ సమస్యలను పరిష్కరిస్తే ప్రపంచ సమస్యలను పరిష్కరించినట్లే అని తెలుసుకోవాలి. కుటుంబాలను ఆనంద కోవెలలుగా మార్చాలి. నిస్వార్థ ప్రేమలకు చిరునామాలు కుటుంబాలు. మనల్ని వరించిన అపూర్వ వరం కుటుంబ ప్రేమ మాత్రమే. ఆరోగ్యం, సంపద, పనిలో సమతుల నిబద్ధత, మహిళా హక్కులపై దృష్టి సారించాలి. కుటుంబాన్ని పౌర సమాజ భవనానికి పటిష్ట సౌధం కావాలి. మూడు, నాలుగు తరాల ప్రేమానురాగాల సమ్మేళనమే ఓ ఆదర్శ కుటుంబం. మనకు పుట్టుకతోనే దేవుడు ఇచ్చిన వరం ఓ అపురూప కుటుంబమే. కుటుంబ వాతావరణమే పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంధనం. పేదరిక నిర్మూలన, వాతావరణ మార్పుల కట్టడి, లింగ సమానత్వాలు కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. శాంతి, సౌభాగ్యాలకు నెలవులు కుటుంబాలు కావాలి. కుటుంబ సహకారం లేకుండా ఏ విజయం కూడా పరిపూర్ణం కాదు. ప్రేమలు వికసించడం, మధుకరా జ్ఞాపకాల నిధులు సాధించడం, నిత్యం నవ్వుల పువ్వులు పూయించడం కుటుంబ కోవెలకు మాత్రమే సుసాధ్యం. పౌర సమాజ వృక్షానికి వివిధ దిశల్లో విస్తరించిన కొమ్మలు, శాఖలే కుటుంబాలని తెలుసుకోవాలి. మన ఆశ, శ్వాస, ఉనికి, ఊపిరి కుటుంబమే. మన జీవిత ప్రారంభం, అనంత ఆనందాల దేవాలయం కుటుంబమే అని తెలుసుకొని కుటుంబ పునాదులను పటిష్ట పరుచుకుందాం, బాధ్యత కలిగిన రేపటి తరాన్ని బహుకరిద్దాం. ప్రతి గడపకు పసుపు పారాణి, మామిడి తోరణాలు మంగళకరం అయినట్లు, ప్రేమల పునాదుల మీద నిర్మితమైన ఆదర్శ కుటుంబాలు "గృహమే కదా స్వర్గ సీమ" అయితే, "దేశమే సౌభాగ్యాల కోవెల"గా మారుతుంది.

# ముక్తిదాయకం.. పుష్కర స్నానం

మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యౌ మునీనాంహి బుద్ధె స్మృతా.." దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభ రాశిలో ఉన్నప్పుడు సింధు నదికి, మీన రాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి, పుష్కరాలు చెప్పబడ్డాయి. పుష్కరం అనగా జల స్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోక కళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపు తున్నాయి. పూర్వము తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట–మూర్తులతో ఒకటైన జల స్వరూపముతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరము పొంది, పరమే శ్వరుని సాయుజ్యము పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతము చేయుటకై శివుని వరముతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలము నందు ఉంచుకొని సృష్టి కార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహాధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆపుష్కరుని సన్నిదిని శక్తి వంతుడై యుండునట్లు కోరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించు చున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ – గంగా) అను సూత్రాను సారం పుష్కరాలు నిర్వహిస్తారు. ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరా లను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్యా, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు. సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది. అలాగే ప్రయాగరాజ్ లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరంలో ఈ పుష్కరాలు జరగనున్నాయి. కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతి నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశీగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతో పాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే ప్రాణమట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశీకి వెళ్లలేని వారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశీలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశం లోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్య దేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. పచ్చని ప్రకృతి మధ్య నెలకొని ఉన్న ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. మొత్తం మీద, సరస్వతీ నదీ పుష్కరాలు ఒక పవిత్రమైన సందర్భం. ఇది నదీమాతకు కృతజ్ఞతలు తెలుపుకునే సమయం, ఆధ్యాత్మిక చింతనకు, పవిత్ర స్నానాలకు ప్రాధాన్యతనిచ్చే సమయం. కాళేశ్వరం వంటి క్షేత్రాలలో ఈ పుష్కరాలను నిర్వహించడం ఆ ప్రాంతానికి మరింత పవిత్రతను చేకూరుస్తుంది. భక్తులు ఈ సమయంలో పాల్గొని పుణ్యం పొందాలని ఆశిస్తారు. సరస్వతీ నది కేవలం ఒక నీటి ప్రవాహం కాదు, అది జ్ఞానానికి, వివేకానికి, పవిత్రతకు చిహ్నం. ఈ పుష్కరాల సమయంలో ఆ నదిలో స్నానం చేయడం ద్వారా భక్తులు తమ అంతరంగిక శుద్ధిని పొందుతారని విశ్వసిస్తారు. ఈ పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తారు. సరస్వతీ నదీ పుష్కరాలు ముక్తిని ప్రసాదించే ఒక గొప్ప అవకాశం.

# రేషన్ బియ్యం దొంగలకు బిగ్‌షాక్

కాకినాడ, మే 14, సివిల్ సప్లై వ్యవస్థ ద్వారా పేదలకు చౌకధరకే బియ్యం పంపిణీ చేస్తోంది ప్రభుత్వం. ఇందులో పందికొక్కుల్లా మారిన కొందరు ఈ పేదల బియ్యాన్ని దారి మళ్లిస్తూ జేబులు నింపకుంటున్నారు. ఇప్పటి వరకు ఇలాంటి కేసుల్లో ఇరుక్కున్న వారంతా చిన్న చిన్న జరిమానాలు, శిక్షలతో బయటపడుతున్నారు. ఇకపై అలా చేయడానికి వీల్లేకుండా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేషన్ బియ్యం దొంగలకు గట్టి దెబ్బే తగలనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలే రేషన్ బియ్యం దారి మళ్లించేవారిపై రౌడీషీట్ తెరవాలని ఆదేశించారు. దీంతో ప్రజాపంపిణీ వ్యవస్థ అయిన రేషన్ డిపోల నుంచి, ఇతర మార్గాల నుంచి పీడీఎస్ బియ్యం దారిమళ్లించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఇకపై అయినా పేదలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యం దోపిడీకి అడ్డుకట్టపడుతుందంటున్నారు.సివిల్ సప్లై వ్యవస్థ ద్వారా రేషన్‌డిపోలకు చేరుతోన్న రేషన్ బియ్యం పలు రకాలుగా పక్కదారిపడుతోంది. చాలా మంది కార్డుదారులు తమకు అవసరం లేకపోయిన బియ్యాన్ని అదే రేషన్ డీలర్లకు అమ్మేస్తున్నారు. లేదా దళారులుకు అమ్ముతుంటారు. ఈ రకంగానే చాలా వరకు బియ్యం పక్కదారిపడుతోంది. వీటిని భారీ మొత్తంలో నిల్వ చేస్తోన్న దళారులు తిరిగి మిల్లర్లకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీంతో అసలు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.. పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసిన మిల్లర్లు వాటిని రీపాలిష్ చేసి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లు చేసి మళ్లీ అవే బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో దర్జాగా అమ్ముతున్నారు. భారీ ధరలకు విక్రయాలు చేస్తున్నారు.. చాలా మంది సన్నగా పాలిష్ పెట్టిన బియ్యం అని కొనుగోలు చేస్తున్నారు. కానీ అవి రేషన్ బియ్యమేనని గ్రహించక అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లు మరో రకమైన మోసాలకు పాల్పడుతున్నారు. తమ వద్ద నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం తిరిగి ప్రభుత్వానికే విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. కొందరు బడా బాబులు అయితే భారీ మొత్తంలో నిల్వ చేస్తున్న పీడీఎస్ బియ్యం వేరే ప్యాకింగ్‌ల్లోకి మార్చి వాటిని విదేశాలకు తరలిస్తున్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నారు. అందుకే కాకినాడ పోర్టులో సివిల్ సప్లై శాఖ మంత్రి పలు దఫాలు ఆకస్మిక దాడులు చేసి గొడౌన్లలో ఎగుమతులకు నిల్వచేసిన పెద్దఎత్తున బియ్యంను గుర్తించి సీజ్ చేయించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం కాకినాడ పోర్టులో ఆకస్మిక తనిఖీలుచేసి స్టెల్లా షిప్ గొడౌన్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భారీగా రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.అత్యవసర సరకుల చట్టం 1955 చట్టం ద్వారా 6ఏ కేసులు నమోదు చేస్తున్నారు అధికారులు. అత్యవసర సరకులను చట్టవిరుద్ధంగా అక్రమ రవాణాచేయడం, లేదా స్వాధీనం చేసుకొని నిల్వ ఉంచడం గుర్తిస్తే ఈ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఈ తరహాలోనే రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేయడం, అక్రమంగా రవాణా చేస్తు చిక్కుతున్న సందర్భాల్లో 6ఏ కేసులు అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ నేరం రుజువైతే మూడు నెలల పాటు జైలు, లేదా జరిమానా శిక్ష పడుతుంది. నేర తీవ్రత ఎక్కువైనా శిక్షలు తక్కువగా ఉండడం, ఏ మాత్రం భయపడని అక్రమార్కులు మళ్లీ పీడీఎస్ బియ్యం దోపిడీలకు పాల్పడుతున్నారు. నిందితుడు మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడితే శిక్ష తీవ్రత పెరిగి ఆరు నెలల నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలు, జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. కేసులు నమోదుల సమయంలో రాజకీయ ఒత్తిళ్లు తదితర కారణాలతో వేరే కొత్త వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో శిక్షలు పడకుండా అక్రమార్కులు తప్పించుకుంటున్నారు. దీంతో చాలా ఈజీగా డబ్బులు సంపాదించుకుంటున్న అక్రమార్కులు మళ్లీమళ్లీ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రేషన్ అక్రమ బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటోంది.. ఇందులో భాగంగా 2024 డిసెంబర్ నాటికి 1066 కేసులు నమోదు కాగా 729 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.. ఇందులో కాకినాడ జిల్లా, ప్రకాశం జిల్లాలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. 729 మందిని ఈ కేసుల్లో అదపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు. 60 టన్నుల వరకు పీడీఎస్ బియ్యం స్వాధీనంచేసుకోగా కాకినాడ జిల్లాలో 25, 386 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడలో గుర్తించిన 50,000 మెట్రిక్ టన్నుల బియ్యంలో ఇది ఒక భాగంగా అధికారులు చెబుతున్నారు.పేదలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యం అక్రమార్కుల పాలవ్వడంపై కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముందు నుంచి సీరియస్‌గా తీసుకుంది. ఈనేపథ్యంలోనే కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతోన్న అక్రమ పీడీఎస్ బియ్యం ఎగుమతులపై దృష్టిసారించి పలు కేసులు నమోదు చేసింది. తాజాగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఎగుమతులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. ఈనేపథ్యంలోనే పీడీఎస్ బియ్యం అక్రమంగా దోచుకుంటున్న వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని ఆదేశించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇంతవరకు 6ఏ కేసులతో ఏం ఫరవాలేదని భావించి తమ అక్రమ దందా చేస్తోన్నవారికి ముఖ్యమంత్రి తాజా ఆదేశాలతో కంటిమీద కునుకు కరువైన పరిస్థితి తలెత్తుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు..

# సామినేని సైలెంట్ అయిపోయారే...

విజయవాడ, మే 14,కాంగ్రెస్ లోనూ, వైసీపీలోనూ ఒక వెలుగు వెలిగిన మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఇప్పుడు వెదికినా కనిపించడం లేదు. రాజకీయంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారో? లేక తనకు ఇక పొలిటికల్ గా కష్టమని భావిస్తున్నారో తెలియదు కానీ దూరంగా ఉన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం అంటే సామినేని ఉదయభాను అందరికీ గుర్తుకు వస్తారు. కృష్ణా జిల్లాలో కాపు సామాజికవర్గం నేతగా ఎంతో పాపులర్. వైఎస్ రాజశేఖర్ రెడ్డి భాను లో ఉన్న ఫైర్ ను చూసి టిక్కెట్ వచ్చేలా చేశారు. దీంతో ఆయన జగ్గయ్య పేట ఎమ్మెల్యే అయి కూర్చున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్, వైసీపీలో ఒకసారి ఓడినా, మరొకసారి గెలుస్తూ తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.అయితే 2019లో గెలిచిన తర్వాత మంత్రి పదవి వస్తుందని ఆశించినా సామినేని ఉదయభాను కు జగన్ కేబినెట్ లో స్థానం దక్కలేదు. రెండుదఫాలుగా కూడా జగన్ ఆయన పక్కన పెట్టారు. తాను నమ్ముకుని వైసీపీలో ఉంటే కనీసం జగన్ తనను పట్టించుకోకపోవడంపై సామినేని ఉదయభాను కొంత రగిలిపోతూనే ఉన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత సామినేని ఉదయభానులో కొంత ఆలోచన బయలుదేరింది. వైసీపీలో ఉంటే తనకు పొలిటికల్ కెరీర్ ఉండదని భావించి జనసేన పార్టీని ఎంచుకున్నారు. జనసేనపార్టీలో చేరినప్పటికీ సామినేని ఉదయ భాను అక్కడ ఇమడ లేకపోతున్నారు. ఎందుకంటే 2024లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా శ్రీరాం తాతయ్య గెలుపొందారు.శ్రీరాం తాతయ్య తన పార్టీకి సంబంధించిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేకాదు వైసీపీ నుంచి వచ్చి జనసేనలో చేరిన వారిని కూడా పక్కన పెడుతున్నారు.2004లో జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి గెలిచిన సామినేని ఉదయ భాను 2009, 2014 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2019 లో గెలిచినా ఫలితం లేకుండా పోయింది. ఏ పదవులు లేకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. ఇక జనసేనలో చేరిన తర్వాత కూడా సామినేని ఉదయ భాను సంతృప్తికరంగా లేరని తెలుస్తుంది. పార్టీలో చేరిన రోజు తప్పించి తర్వాత జనసేన కేంద్ర కార్యాలయానికి వచ్చిన సంఘటనలు కూడా అరుదు అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి కాదని జనసేనకు కూడా టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదన్నది సామినేని ఉదయ భానుకు అర్థమయిందంటున్నారు.తనకు ఇక మళ్లీ వైసీపీకి వెళ్లడమే మంచిదన్న సూచనలు కార్యకర్తలు, నేతలు నుంచి అందుతున్నాయి. దీంతో ససామినేని ఉదయ భాను పునరాలోచనలో పడ్డారని చెబుతున్నారు. అయితే ఒకసారి పార్టీని వీడి వచ్చిన తర్వాత తిరిగి చేరడంపై ఆయన ఆలోచనలు సాగుతున్నాయట. ఒకవేళ తిరిగి వైసీపీలోకి వెళ్లినా గతంలో మాదిరిగా ప్రాధాన్యత లభిస్తుందన్న గ్యారంటీ లేదు. అలాగని జనసేనలో ఉంటే పూర్తిగా పొలిటికల్ కెరీర్ క్లోజ్ చేసుకున్నట్లే అవుతుంది. అందుకే ఇప్పుడు సామినేని ఉదయ భాను అడ్డరోడ్డులో అదను కోసం వేచి ఉండటం తప్ప వేరే దారిలేదంటున్నారు. మొత్తం మీద ఒక సీనియర్ నేత పార్టీ మారినా ఫలితం లేకపోవడంతో రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు.

# బదిలీపై వెళుతున్న అధికారికి ఘన సన్మానం

కమాన్ పూర్ సింగరేణి సంస్థ ఆర్జీ టు పరిధిలోనివకీల్ పల్లి గనిలో గ్రూప్ ఇంజనీర్ గా విధులు నిర్వహించి బదిలీపై కొత్తగూడెం ఏరియా కార్పొరేట్ కు వెళుతున్న చంద్రశేఖర్ ని వకీల్ పల్లి గని మేనేజర్ రవి కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మరియు ఇతర అధికారులు, ఉద్యోగులు అన్ని యూనియన్ల నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు ఉద్యోగులు వారితో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ తిరుపతి, డివైపిఎం శ్యాంప్రసాద్ అన్ని యూనియన్ల నాయకులు, వకీల్ పల్లి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సైలెంట్ గా మారిపోయిన నందిగం

గుంటూరు, మే 14, మాజీ పార్లమెంటు సభ్యుడు నందిగం సురేష్ ఒక్క కేసుతో ఒక పెదవులకు తాళం వేసుకున్నట్లుంది. అధికారంలో లేనప్పుడు అంటే 2019 నుంచి 2024 వరకూ ఒక వెలుగు వెలిగిన నందిగం సురేష్ ఇప్పుడు పార్టీ నేతలకు కూడా దొరకడం లేదు. జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చినప్పుడు అలా హాజరు వేయించుకోవడం మినహా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నందిగం సురేష్ పై వరస కేసులు నమోదయ్యాయి. హత్య కేసుతో పాటు మరికొన్ని కేసులు నందిగం సురేష్ మెడకు చుట్టుకున్నాయి. దీంతో కొన్ని నెలల పాటు జైలు ఊచలను లెక్కపెట్టాల్సి వచ్చింది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత నందిగం సురేష్ మాత్రం మౌనంగానే ఉంటున్నారు.రాజధాని అమరావతి ప్రాంతంలో ఉండే ఈ యువనాయకుడు తొలిసారి బాపట్ల నియోజవర్గం నుంచి పోటీ చేసి పార్లమెంటులోకి అడుగుపెట్టాడు. చిన్నవయసులో పార్లమెంటు లోకి కాలు పెట్టడం అంటే ఎవరికీ రాని ఛాన్స్ జగన్ నందిగం సురేష్ కు ఇచ్చారు. 2019 ఎన్నికలకు ముందు వరకూ నందిగం సురేష్ అంటే ఎవరో పెద్దగా తెలియదు. రాజధాని అమరావతి ప్రాంతంలో పంటపొలాలు దగ్ధం అయిన కేసులో నందిగం సురేష్ వెలుగులోకి వచ్చారు. రాజధాని ప్రాంతానికి చెందిన నందిగం సురేష్ కు జగన్ బాపట్ల పార్లమెంటు స్థానం టిక్కెట్ ఇచ్చారు. అనూహ్యంగా గెలుపొందిన సురేష్ తర్వాత పార్టీలో కీలకంగా మారాడు. చంద్రబాబుపైనా, లోకేశ్ పైనా మీడియా డిస్కషన్స్ లో విమర్శలు చేసి మరింత పాపులారిటీ సంపాదించుకున్నారు.బాపట్ల నియోజకవర్గం ఎంపీగా ఉన్న జగన్ కు అత్యంత ఇష్టమైన నేతగా ముద్రపడ్డారు నందిగం సురేష్. చివరకు టిక్కెట్ల విషయంలో అభ్యర్థుల ప్రకటన కూడా నందిగం సురేష్ చేత జగన్ చేయించారు. జగన్ అంటే ప్రాణం ఇచ్చేందుకైనా సిద్ధమని అనేక సార్లు కామెంట్స్ చేసిన నందిగం సురేష్ మరోసారి బాపట్ల ఎంపీగా పోటీ చేసి 2024 ఎన్నికలలో దారుణ ఓటమిని చవి చూశారు. దీనికితోడు గతంలో తాను చేసిన విమర్శలతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా భావించి కూటమి ప్రభుత్వం నందిగం సురేష్ ను అరెస్ట్ చేయించింది. నెలల పాటు జైల్లో ఉండటంతో నందిగంలో ఫైర్ చల్లబడిందని అంటున్నారు. నాలుగేళ్ల పాటు మౌనంగానే ఉండటం మంచిదన్న భావనలో ఉన్నారు.నందిగం సురేష్ గతంలో ఎప్పుడూ ఇలా సైలెంట్ గా లేరు. కనీసం తాను ప్రాతినిధ్యం వహించిన బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం వైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. రాజధాని ప్రాంతంలో ఉన్న తన ఇంటికే ఆయన పరిమితమయ్యారు. జగన్ తాడేపల్లికి వచ్చినప్పుడు కలవడం మినహా పెద్దగా యాక్టివ్ గా లేరని, హైదరాబాద్ టు అమరావతి ఎక్కువగా తిరుగుతున్నారని అంటున్నారు. అలాగే కూటమి ప్రభుత్వంపై విమర్శల జోరు కూడా నందిగం సురేష్ తగ్గించారు. ఎందుకంటే మళ్లీ జైలు ఊచలు పిలుస్తాయేమోనన్నభయం ఆయనను వెంటాడుతుందని అంటున్నారు. అందుకే నందిగం సురేష్ లో నాటి ఫైర్ ఏదంటూ కొందరు వైసీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. రాజకీయాలకు దూరంగా ఉండటమేంటని నిలదీస్తున్నారు.

# కోట్ల ఇంటి పేరు కనుమరుగునా

కర్నూలు, మే 14, మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి రాజకీయాల్లో ఉన్నారా? లేదా? అని అనిపించేలా ఉంది. గతంలో ఏ పదవీ లేనప్పుడే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి యాక్టివ్ గా తిరిగే వారు. అంతేకాదు నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ఇంటిపేరు తెరమరుగు కాకుండా సూర్యప్రకాశ్ రెడ్డి ప్రయత్నించేవారు. కానీ 2024 ఎన్నికల నాటి నుంచి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఎందుకో మౌనంగా ఉండటంతో పాటు ఒక శాసనసభ నియోజకవర్గానికే పరిమితయ్యారు. ఒకప్పుడు కర్నూలు జిల్లాను శాసించిన కోట్ల కుటుంబం ఇప్పుడు కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితమయింది. ఇక పార్టీలోనూ ఆయనకు పెద్దగా ప్రయారిటీ కనిపించకపోవడంతో తాను పార్టీ మారి తప్పు చేశానా? అన్న ఆలోచనలో పడిపోయారంటారు.కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి కుమారుడు. ఇప్పటికీ కోట్ల ఫ్యామిలీకి కర్నూలు జిల్లాలో మంచి పేరుంది. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం అంటే ఆయనకు ఎనలేని ప్రేమ. అక్కడి నుంచి గెలిచి కాంగ్రెస్ హయాంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రి పదవి కూడా దక్కించుకోగలిగారు. మాజీ ముఖ్యమంత్రి కుమారుడిగానే కాకుండా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరిపోయారు. ఎన్నో ఆశలు పెట్టుకుని పార్టీలో చేరిన కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి తర్వాత జరుగుతున్న పరిణామాలు రాజకీయంగా నీరసం తెప్పించాయని చెప్పాలిడోన్ నియోజకవర్గం నుంచి కూటమి హవాలో గెలుపొందిన కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తనకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా అది జరగలేదు.దీంతో ఆయన సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చాలా రోజుల తర్వాత శాసనసభకు పోటీ చేశారు. నిజానికి ఆయన కర్నూలు పార్లమెంటుకు పోటీ చేయాలని ఉన్నా చంద్రబాబు డోన్ టిక్కెట్ ఇవ్వడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఆయన శాసనసభకు పోటీ చేయాల్సి వచ్చింది. ఆయన ఎన్నికల వేళ నేరుగా కూడా ప్రజలతో చెప్పారు. తాను కర్నూలు పార్లమెంటుకు పోటీ చేయాల్సి ఉందని, అయితే అనివార్య కారణాలతో పోటీ చేయలేకపోయానని కన్నీటి పర్యతంతమయ్యారు. నిజానికి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఎప్పుడూ శాసనసభ వైపు చూడలేదు. ఢిల్లీ వైపు ఆయన చూపు ఉంటుంది. పార్లమెంటు సభ్యుడిగా ఉంటే ఆ గౌరవం వేరు అని ఆయన భావిస్తారు. కుటుంబానికి ఉన్న ప్రతిష్టతో పాటు గౌరవం కూడా నిలబడుతుందని ఆయన అనుకుంటారు.కర్నూలు జిల్లా నుంచి టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డిలు మంత్రులుగా ఎంపిక చే?సుకోవడంతో కోట్ల సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కి మంత్రి పదవి ఇస్తే కేఈ కుటుంబానికి కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే రెండు కుటుంబాలకు రాజకీయ వైరం ఈ నాటిది కాదు. అందుకే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిని చంద్రబాబు పక్కన పెట్టారన్న వాదనల్లో కూడా నిజముంది. పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన పెద్దగా హాజరు కావడం లేదు అని చెబుతున్నారు. డోన్ లో అప్పుడప్పుడు పర్యటిస్తూ తాను ఎమ్మెల్యే అనేకంటే మాజీ ఎంపీగానే ఆయన చెలామణి అవుతూ తిరుగుతున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మొత్తం మీద కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రం ఏం చేయలేని పరిస్థితుల్లో మౌనంగానే ఉంటూ ఈ నాలుగేళ్లు గడిస్తే చాలు అని అనుకుంటున్నారట.

# వైజాగ్ లో గాజు వంతెన

విశాఖపట్టణం, మే 14, విశాఖపట్నం పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా కైలాసగిరి వద్ద దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన నిర్మాణం దాదాపు పూర్తయింది. 50 మీటర్ల పొడవుతో నిర్మితమవుతున్న ఈ కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెన పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. దీనితో పాటు జిప్-లైన్‌లు, స్కై-సైక్లింగ్ ట్రాక్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ వంతెన పూర్తయితే, ప్రస్తుతం కేరళలోని వాగమోన్ గ్లాస్ బ్రిడ్జి రికార్డును కైలాసగిరి గాజు వంతెన బద్దలు కొడుతుంది.ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలను టూరిస్ట్ స్పాట్‌లుగా అభివృద్ధి చేసి ఏపీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉంది. ఈ క్రమంలోనే సముద్ర తీర ప్రాంతం వెంబడి అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఏపీలో బెస్ట్ టూరిస్ట్ స్పాట్ ఏంటంటే ప్రతి ఒక్కరూ ఠక్కున చెప్పేమాట .. విశాఖపట్నం. సాగర హోరు.. అలల జోరు.. ప్రకృతి అందాలతో వైజాగ్ పర్యాటకులను కట్టిపడేస్తూ ఉంటుంది. పోర్టు నుంచి మ్యూజియం వరకూ.. సింహాచలం దేవస్థానం, బీచ్‌లు, కైలాసగిరి ఇలా ఒక్కటేమిటి ఎన్నో అందాలు విశాఖ సొంతం. అలాంటి విశాఖ సిగలో మరో మణిహారం చేరనుంది.విశాఖపట్నంలో భారతదేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెన నిర్మితమవుతోంది. నిర్మాణం కూడా దాదాపుగా పూర్తి కావొచ్చింది. విశాఖపట్నంలో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించడంలో భాగంగా భారతదేశంలోనే అతి పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెనను నిర్మిస్తున్నారు. 50 మీటర్ల పొడవు ఉండే ఈ గాజు వంతెనను విశాఖపట్నం కైలాసగిరి వద్ద టైటానిక్ వ్యూపాయింట్‌కు దగ్గరగా ఏర్పాటు చేస్తున్నారు. సముద్రపు అందాలు, ప్రకృతి సౌందర్యాలను ఆకాశం నుంచి వీక్షించేలా.. సాహస ప్రియులకు, ప్రకృతి ప్రేమికులకు ఈ గ్లాస్ స్కైవాక్ మరపురాని అనుభవాన్ని అందించనుంది.ఈ ప్రాజెక్టు కోసం సుమారుగా 6 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 2024 నవంబర్‌లో గాజు వంతెన నిర్మాణం ప్రారంభమైంది. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. ఈ గాజు వంతెన నిర్మాణం పూర్తి అయితే భారతదేశంలోనే అతి పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెనగా విశాఖ గాజు వంతెన నిలవనుంది. ఓవైపు సముద్రం, మరోవైపు కొండల అద్భుతమైన దృశ్యాలతో, నేల నుంచి ఎత్తులో నడుస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో దీనిని నిర్మిస్తున్నారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు ప్రైవేట్ సంస్థలు ఈ గాజు వంతెన నిర్మాణంలో పాలుపంచుకుంటున్నాయి.ఒకేసారి 40 మంది వరకూ దీనిపై నిల్చునేలా ఈ గాజు వంతెన నిర్మిస్తున్నారు. స్కైవాక్‌తో పాటు, రెండు జిప్-లైన్‌లు, స్కై-సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్కటి 150 మీటర్లు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం కేరళలోని వాగమోన్ గ్లాస్ బ్రిడ్జి భారతదేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెనగా పేరొందింది. ఇది 40 మీటర్ల పొడవు ఉంటుంది. కైలాసగిరి స్కైవాక్ నిర్మాణం పూర్తి అయితే ఆ రికార్డును విశాఖపట్నం స్కైవాక్ బద్ధలు కొట్టనుంది. భారతదేశంలోనే పొడవైన గాజు వంతెనగా కైలాసగిరి గ్లాస్ స్కైవాక్ నిలుస్తుంది.

# అర్జీ.1 ఏరియాలో

## “ మెగా జాబ్ మేళా”

గోదావరిఖని మరియు పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు తెలంగాణా రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం - సింగరేణి సిఎం.డి ఎన్. బలరాం ఐ ఆర్ ఎస్ సూచనల మేరకు రామగుండం ఏరియా1లో తేది.18.05.2025, ఆదివారం రోజున “మెగా జాబ్ మేళా” నిర్వహణ కొరకు అర్జి.1 జియం శ్రీ లలిత్ కుమార్ గారి సారధ్యంలో అధికారుల బృందం కమ్యూనిటి హాలు మరియు జవహర్ లాల నెహ్రు స్టేడియం నందు స్థల పరిశీలన చేసి బస్టాండ్ కు మరియు మెయిన్ రోడ్ కు దగ్గర ఉన్నందున కమ్యూనిటీ హాల్ ను ఎంపిక చేయడం జరిగినది. ఈ మెగా జాబ్ మేళా తేదీ 18.05.2025 రోజున గోదావరిఖని కమ్యూనిటీ హాల్ నందు పెద్ద ఎత్తున నిర్వహించుటకు తగిన ఏర్పాట్లు చేయాలనీ ఇందులో 100 కంపెనీలు రానున్నాయని ఈ మెగా జాబ్ మేళాలో రామగుండం 1,2,3 ఏరియాలు మరియు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుండి సుమారు 10 వేల మంది నిరుద్యోగ యువతి యువకులు పాల్గొంటారని వారికి సరిపడు షామియానాలు, చల్లదనం కొరకు కూలర్స్, త్రాగు నీరు, హెల్ప్ డెస్క్ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూల కొరకు ప్రత్యేక సేల్స్ వచ్చే కంపెనీల వారికి ప్రత్యేక వసతి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు, అత్యున్నత అధికారులకు సరిపడు స్టేజి ఏర్పాట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమం విజయవంతం చేయడంలో అధికారులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, అన్ని గనుల సంక్షేమాధికారులు పెద్ద ఎత్తున ఉద్యోగుల పిల్లలు పాల్గొనేల చూడాలని తెలిపారు మరియు వివిధ డిపార్ట్ మెంట్ల ఉన్నతాధికారులు వారికి నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారి చేసారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, ఎన్విరాన్ మెంట్ డిజియం ఆంజనేయ ప్రసాద్, డిజీ.ఎం వర్క్ షాప్ జితేందర్ సింగ్, డిజియం వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, అధికారులు డెనిల్ కుమార్, వీరారెడ్డి, మరియు నాయకులు రంగు శ్రీనివాస్, పొలసాని శ్రీనివాస్, మహంకాళీ స్వామి, దీటి బాలరాజు గట్ల రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ లో రోబోటిక్ సర్జరీలు

అమరావతి, మే 14,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలో ఉన్న మంగళగిరి ఎయిమ్స్ ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. ఎయిమ్స్‌లో ఉన్న విభాగాలతోపాటు తాజాగా గుండెకు సంబంధించి సర్జరీ విభాగాన్ని ప్రారంభించినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ అహంథెం సాంతా సింగ్ తెలిపారు. ఎయిమ్స్‌లో గుండెకు సంబంధించిన అన్ని పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాలూ అందుబాటులోకి రాగా.. ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీని కూడా విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఎయిమ్స్‌లో రోబోటిక్ సర్జరీలను ప్రారంభించామన్నారు.ఎయిమ్స్‌లో నర్సింగ్ కళాశాల విద్యార్థులతో ప్రపంచ నర్సింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాక్‌థాన్‌ను నిర్వహించారు. ఎయిమ్స్ నుంచి మంగళగిరి అంబేద్కర్ విగ్రహం కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కార్డియాక్ అరెస్ట్ సమయంలో అత్యవసరంగా నిర్వహించాల్సిన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌ని ముఖ్యమంత్రికి అత్యవసర వైద్యసేవల నిమిత్తం కంటింజెన్సీ ఆసుపత్రిగా కూడా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇప్పటి వరకు మణిపాల్ ఆసుపత్రి ఒక్కటే కంటింజెన్సీ ఆస్పత్రిగా ఉంది.కేంద్రం విభజన చట్టం ప్రకారం అమరావతి పరిధిలోని గుంటూరు జిల్లా మంగళగిరిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు అక్కడ పనుల్ని వేగవంతం చేస్తూ ఒక్కో విభాగాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే ఎయిమ్స్‌లో ప్రజలకు సేవలు కూడా అందుతున్నాయి. ఈ మేరకు ఇటీవల ఎయిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణం కోసం భూమిని కేటాయించారు. నేషనల్ హైవే పక్కన 10ఎకరాల భూమి కోసం ప్రతిపాదనలు పంపించారు. 183 ఎకరాల్లో నిర్మించిన ఎయిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కాలేదు.. ఈ విషయాన్ని గమనించి, అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ చొరవతో.. ఎయిమ్స్‌కు వెళ్లే దారిలో నేషనల్ హైవే పక్కన కొలనుకొండలో 10 ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు అక్కడ ట్రామా కేర్ ఏర్పాటుకు అడుగులుపడుతున్నాయి. ఎయిమ్స్‌కు 965 పడకలు మంజూరు కాగా.. ప్రస్తుతం 650 ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచడంతో పాటు ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు

విమ్స్ లో మోకాళ్ల ఆస్పత్రికి ఆపరేషన్లు

విశాఖపట్నంవాసులకు తీపికబురు.. రూపాయి ఖర్చు లేకుండా మోకాళ్ల నొప్పులకు ఫ్రీగా ట్రీట్మెంట్ అందుతోందని మీకు తెలుసా. అవును నగరంలో విమ్స్ ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. విమ్స్‌లోని ఎముకల విభాగానికి ఎక్కువ మంది వస్తుండగా.. మోకాళ్ల నొప్పులకు అత్యాధునిక ప్లాస్మా చికిత్స ఉచితంగా అందుబాటులో ఉంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలల్లో ఖర్చయ్యే ఈ చికిత్సను విమ్స్‌లో ఉచితంగా అందిస్తున్నారు. దీని ద్వారా చాలా మంది నొప్పుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. విమ్స్ ఆసుపత్రి ఇప్పుడు కేజీహెచ్‌కి మరో ఆసుపత్రిలా ఉపయోగపడుతుంది. కేజీహెచ్ దూరంగా ఉన్నవాళ్లు, శివారు ప్రాంతాల వాళ్లు ఇక్కడికి వస్తున్నారు. ప్రతిరోజు 500 నుంచి 700 మంది ఓపీకి వస్తుంటారు. అందులో 180 నుంచి 225 మంది వరకు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటారు. అన్ని విభాగాలకన్నా ఎముకల సమస్యలతో వచ్చేవాళ్లే ఎక్కువ.విమ్స్‌లో మోకాళ్ల నొప్పులకు సరికొత్త ప్లాస్మా ట్రీట్‌మెంట్ ఉంది. బయట ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ ట్రీట్‌మెంట్ చేయించుకుంటే చాలా డబ్బులు అవుతాయి. కానీ విమ్స్‌లో మాత్రం ఉచితంగా చేస్తున్నారు. దీని ద్వారా ఏటా వేల మంది నొప్పులు తగ్గిపోతున్నాయి. 50 ఏళ్లు దాటకుండానే చాలామంది మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని.. కొంతమందికి మోకాళ్ల చిప్పలు అరిగిపోయి నడవలేని పరిస్థితి వస్తుంది. దీనికి ప్లాస్మా థెరపీ అనే కొత్త వైద్యం అందుబాటులో ఉంది.బయట ఆసుపత్రుల్లో ఈ ట్రీట్మెంట్ ఖరీదైనది కావడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి విమ్స్‌లో ఉచితంగా ప్లాస్మా చికిత్స అందిస్తున్నాము అన్నారు. ఈ ట్రీట్‌మెంట్‌లో మోకాళ్లలోని రక్తాన్ని తీసి, దాని బదులు ప్లాస్మాను ఎక్కిస్తారు. ఇలా రెండు మూడు సార్లు చేస్తే రోగులు నార్మల్‌గా నడవగలుగుతారు. ఈ విభాగంలో 5 మంది డాక్టర్లు, 10 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడేవాళ్లకు పీఆర్‌పీ విధానంలో ట్రీట్‌మెంట్ చేస్తున్నారు అక్కడి డాక్టర్లు. దీనివల్ల రోగులు నొప్పి లేకుండా నడవగలుగుతారని.. ఈ తరహా చికిత్స రాష్ట్రంలో మరే ఇతర ప్రభుత్వాసుపత్రిలో లేదని.. ఆ ఘనత విమ్స్‌కే దక్కుతుందంటున్నారు. ఎముకల విభాగం ఓపీకి ఎక్కువ మంది వస్తుండగా.. ఫిజియోథెరపీతోనే చాలామందికి నొప్పులు తగ్గుతున్నాయట.. అవసరమైన వాళ్లకు ఆపరేషన్లు కూడా చేస్తున్నారు డాక్టర్లు. విమ్స్‌లో ఏడాదిలో మోకాళ్ల చిప్పల మార్పిడి - 38, తుంటి ఎముక - 22, ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా థెరపి(పీఆర్‌పీ) (మోకాళ్ల నొప్పులు ఉన్న వారికి) - 1800, ఫిజియో థెరపి - 18,000 పూర్తిచేశామంటున్నారు. విశాఖవాసులు ఈ చక్కటి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరుతున్నారు విమ్స్ డాక్టర్లు.

# తెలంగాణ బాటలో ఆంధ్రా...

విజయవాడ, మే 14, నాన్‌లోకల్ కోటా రిజర్వేషన్లపై తెలంగాణ బాటలో ఏపీ పయనిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో 15శాతం నాన్ లోకల్ కోటాను తెలంగాణ స్థానికత కలిగిన వారికి పరిమితం చేయగా తాజాగా ఏపీలో కూడా అదే విధానాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికేతర కోటాకు కొత్త నిర్వచనాలపై స్పష్టత ఇచ్చింది.ఏపీలో 15శాతం నాన్ లోకల్ కోటా రిజర్వేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య కోర్సుల్లో ప్రస్తుతం అమలవుతున్న 15% నాన్ లోకల్, జనరల్ కోటా సీట్లను ఇకపై పూర్తిగా ఏపీ వారికే కేటాయిస్తారు. 2025-26 విద్యా సంవత్సరంలో నాన్ లోకల్ కోటా 15% సీట్లు ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన విద్యార్థులకే దక్కుతాయి. నాన్ లోకల్ సీట్లలో తెలంగాణకు చెందిన వారికి కూడా అవకాశం ఉండేది. ప్రభుత్వ ఉత్తర్వులతో తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల వారికి ఈ అవకాశం ఉండదు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్యలో ప్రొఫెషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనల్లో స్థానిక, స్థానికేతర నిర్వచనాలను స్పష్టం చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో-20, 21, 22లను జారీ చేశారు. తెలంగాణలో స్థానికతపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్థానికులకే వర్తింప చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కన్వీనర్ కోటా సీట్లు 10%లో 85% సీట్లను స్థానికులకు కేటాయిస్తారు.

రెండు రీజియన్ల పరిధిలో ప్రవేశాలు..

ఏపీలో స్థానికత రెండు రీజి యన్లుగా అమలు చేస్తారు. ఆంధ్ర యూనివర్శిటీ, శ్రీవేంకటేశ్వర వర్శిటీ రీజియన్లుగా స్థానికతను నిర్ణయి స్తారు. విభజన తర్వాత 10 ఏళ్లుగా ఏపీలో ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా రీజియన్లుగా సీట్ల భర్తీ చేసేవారు. తాజాగా ఉస్మానియా రీజియన్ ఏపీలో తొలగించారు. ఇకపై ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర రీజియన్ల వారీగా సీట్లను భర్తీ చేస్తారు.

ఆంధ్ర రీజియన్‌లో ఈ జిల్లాలు..

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఏయూ పరిధిలో ఉంటాయి. ఈ జిల్లాల్లో చదివే విద్యార్థులను ఏయూ రీజియన్ స్థానికులుగా పరిగణిస్తారు.

శ్రీ వేంకటేశ్వర పరిధిలో జిల్లాలు...

ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలు ఎస్వీయూ పరిధిలో ఉంటాయి. ఈ జిల్లాల వారిని ఎస్వీ లోకల్‌గా పరిగణిస్తారు.స్థానికేతర, జనరల్ కోటా 15% సీట్ల కేటాయింపునకు కొన్ని నిబంధనలు విధించారు. ఆంధ్ర వర్సిటీ రీజియన్ అభ్యర్థులు.. శ్రీవేంకటే శ్వర రీజియన్‌లో 15% సీట్లకు పోటీ పడొచ్చు. శ్రీవేంకటేశ్వర రీజియన్ విద్యార్థులు.. ఆంధ్రా ప్రాంతంలో 15% స్థానికేతర సీట్లకు అర్హులవుతారు.

ఉద్యోగ ఉపాధి కారణాల రీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా.. ఇద్దరిలో ఎవరైనా ఒకరు గతంలో పదేళ్ల పాటు ఏపీలో నివసించిన వారై ఉంటే వారి పిల్లలు ఈ కోటాలో పోటీ పడొచ్చు.

అభ్యర్థి ఏపీలో కనీసం 10 ఏళ్లు నివసించి ఉండాలి. రాష్ట్రం బయట చదువుకున్న కాలాన్ని మినహాయించిన తర్వాత పదేళ్లు ఏపీలో నివాసం ఉండాలి.

అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు గతంలో మాదిరిగానే రీజియన్ల వారీగా ఆరు నుంచి ఇంటర్మీడి యట్ చదువును ప్రామాణికంగా తీసుకుంటారు. బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ తదితర కోర్సులకు మొదట తొమ్మిదో తరగతి నుంచి ఇంట ర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్ల చదువును పరిగణలోకి తీసుకుంటారు.9 నుంచి ఇంటర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్లు ఆయా రీజియన్లలో చదవకపోయినా.. ఏడేళ్లలో నాలుగేళ్లు చదివి ఉండాలి. ఏడేళ్ల కాలంలో ఎక్కువ కాలం చదివిన ప్రాంతాన్ని వారి స్థానికతకు ప్రామాణికంగా తీసుకుంటారు.

స్థానిక ప్రాంతంలో ఏ విద్యా సంస్థల్లోనూ నాలుగేళ్లు చదవకపోయినా.. అభ్యర్థి హాజరయ్యే అర్హత పరీక్షకు ముందు నాలుగేళ్లు ఏ ప్రాంతంలో నివాసం ఉంటే దాన్ని స్థానికతగా పరిగణిస్తారు.

రెండు లేదా అంత కంటే ఎక్కువ ప్రాంతాల్లో చదివిన కాలం సమానంగా ఉంటే చివరిగా చదివిన ప్రాంతాన్ని స్థానికతగా తీసుకుంటారు.

రాష్ట్రంలో ఏడేళ్లు ఏ విద్యాసంస్థల్లో చదవకపోయినా.. అర్హత పరీక్ష రాయక ముందు నుంచి ఏడేళ్ల పాటు ఏపీలో నివసించి ఉంటే స్థానిక అభ్యర్థులుగా లెక్కిస్తారు. ఏపీలో ఉన్న ఏడేళ్లలో ఎక్కడ ఎక్కువ కాలం నివసించి ఉంటారో అక్కడ స్థానికులుగా పరిగణనలోకి వస్తారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాల యాలు, ఇతర అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యో గుల పిల్లలు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా నాన్ లోకల్ సీట్లకు పోటీ పడొచ్చు.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీవిత భాగస్వాములు కూడా నాన్‌లోకల్ కోటాకు అర్హులు అవుతారు. ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ పనిచేస్తుంటే వారి భాగస్వామి భార్య లేదా భర్త స్థానికేతర కోటాకు దరఖాస్తు చేసుకోవచ్చు.

# మద్యం మాఫియా.. ఏజెన్సీలో అడ్డగోలు దందా...

భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గం లోమద్యం మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని,లక్షల్లో మద్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు అక్రమంగా కోట్ల రూపాయలకుపడగలెత్తేందుకు మాఫియాకు తెరలేపారని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో అడ్డగోలుగా దందా చేస్తున్నారని, సామాజిక సేవకులు కర్నే బాబురావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మద్యం షాపుల వ్యాపారులు సిండికేట్ తో విచ్చలవిడి అమ్మకాలకు తెర లేపారన్నారు.అధికారుల కనుసన్నల్లోనే 24 గంటల పాటు బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఓవైపు ప్రభుత్వ వైన్ షాపులలో మరో వైపు బెల్ట్ షాపులలో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నా, ఎక్సైజు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధిక ధరలపై మద్యం ఆగడాలపై ఫిర్యాదు చేసేందుకు ఎవరైనా ఎక్సైజ్ కార్యాలయానికి వెళితే మాత్రం అక్కడ అధికారులు అందుబాటులో ఉండరని, కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి ఎవరైనా మద్యం ఆగడాలపై ప్రశ్నిస్తే.. ‘నిజమా? మా దృష్టికి రాలేదే’.? అంటూ? అమాయకపు చూపులు చూడటం అధికారులకు పరిపాటిగా మారిందన్నారు. మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ తాగినోడుకి తాగినంత...మందు మస్తుగా దొరుకుతున్నదని, ఏ ఊర్లె చూసినా, ఏ సందులో చూసినా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లెక్క వెలుస్తున్నాయన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా వాటిలో మద్యం బహిరంగంగా విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ చూసిన వైన్ షాప్ టు వయా బెల్టు షాప్ ల అక్రమ రవాణా ఆర్టీసీ కార్గో రవాణాను తలపిస్తుందన్నారు. ఏజెన్సీలో అధిక ధరలతో అక్రమ దందా, మూడు పువ్వులు ఆరు కాయలుగా తేజరిల్లుతోందన్నారు. ఈ విషయంలో సంబంధిత ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోందన్నారు.

# పీవీని సొంతం చేసుకొనే పనిలో కమలం...

# గతేడాది భారత రత్న.. ఈ ఏడాది విగ్రహం...

హైదరాబాద్, మే 14, దేశ రాజధానిలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి.ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే పీవీ విగ్రహం ఏర్పాటుకు లైన్ క్లియర్ కావడం చర్చనీయాంశంగా మారింది.జూన్ 28న పీవీ జయంతి. ఈలోగా తెలంగాణ భవన్ వద్ద పీవీ విగ్రహం ఏర్పాటుకు దిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ అనుమతి ఇచ్చింది.అయితే, విగ్రహ ఏర్పాటుపై ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం లేదని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.మార్చి 27వ తేదీన దిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ సమావేశం జరిగింది.

ఇందులో 'అదనపు వివరాలు' కింద న్యూదిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్డీఎంసీ) పంపించిన ఆన్‌లైన్ దరఖాస్తుపై కమిషన్ చర్చించినట్లుగా మినిట్స్ లో ఉంది.ఇందులో పీవీ నరసింహారావు విగ్రహం తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసేందుకు అనుమతించింది కమిషన్.చుట్టూ ఉన్న పచ్చదనం, ఫుట్‌పాత్‌లకు ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేసింది."రాత్రిళ్లు కూడా విగ్రహం స్పష్టంగా కనిపించేలా లైటింగ్ ఉండాలి. కాంతి కాలుష్యం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని సమావేశం మినిట్స్ లో పేర్కొంది.దిల్లీలో పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు 2024 ఏప్రిల్ 24న న్యూదిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకుంది."ఏపీ భవన్ లేదా తెలంగాణ భవన్ వద్ద కాంస్య విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి" అని కోరింది.ఇప్పటికే దిల్లీలోని ఏపీ భవన్ వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం ఉంది. ఇది ఏపీ భవన్ (కాంపౌండ్ వాల్) బయట ఫుట్‌పాత్ పక్కన ఉంది. టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేశారు.ప్రకాశం పంతులు విగ్రహాన్ని 1992 నవంబరు 8న అప్పుడు ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావు ఆవిష్కరించారు.పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటుకు దిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ అనుమతించగా, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంటుందని తెలంగాణ ప్రభుత్వ అధికారి ఒకరు బీబీసీతో చెప్పారు"పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన న్యూదిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ది కాదు. దీనిపై పాలకమండలి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది" అని కార్పొరేషన్ చైర్ పర్సన్ కేశవ్ చంద్ర చెప్పినట్లుగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రాసింది."పీవీ విగ్రహం ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వానికి ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం లేదు" అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి చెప్పారు.ఒకవేళ ప్రకాశం పంతులు విగ్రహం వద్ద పెట్టుకుంటే, అది ఏపీ లేదా తెలంగాణ భవన్ పరిధిలోకి రాదని చెప్పారాయన.దిల్లీ ఆర్ట్ కమిషన్ పీవీ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో, తెలంగాణ ప్రభుత్వం తరఫున విగ్రహం పెడతామంటే స్వాగతిస్తామని పీవీ నరసింహారావు మనవడు ఎన్వీ సుభాష్ చెప్పారు.దిల్లీలో పీవీ విగ్రహం ఏర్పాటుకు 2005 నుంచి ప్రతిపాదిస్తూ వచ్చినట్లు ఎన్వీ సుభాష్ చెప్పారు.'యూపీఏ ప్రభుత్వంలో అనుమతులు రాలేదు. పీవీకి భారతరత్న ఇచ్చాక మా కుటుంబం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైంది. ఆ సందర్భంలో కూడా పీవీ విగ్రహం ఏర్పాటు అంశం చర్చకు వచ్చింది" అని బీబీసీతో చెప్పారు ఎన్వీ సుభాష్.మొదటి నుంచి గాంధీ కుటుంబానికి విధేయుడిగా పీవీకీ గుర్తింపు ఉంది. 2004డిసెంబరులో గార్డియన్ పత్రిక దీనికి ఒక ఉదాహరణను తన కథనంలో పేర్కొంది."1984లో ఇందిరా గాంధీ హత్య జరిగినప్పుడు ఆయన కేంద్ర హోం శాఖ మంత్రిగా ఉన్నారు. సాంకేతికంగా చూస్తే భద్రత వైఫల్యానికి బాధ్యులయ్యేవారు. కానీ, తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ.. ఆయన్ను రక్షణ మంత్రిగా కేబినెట్ లోకి తీసుకున్నారు" అని గార్డియన్ పత్రిక కథనంలో పేర్కొంది.పీవీ మరణించినప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని యూపీఏ సంకీర్ణ కూటమి కేంద్రంలో అధికారంలో ఉంది.నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంది.ప్రధానిగా పని చేసిన పీవీకి దిల్లీలో అంత్యక్రియలు నిర్వహించకుండా హైదరాబాద్ తరలించడం, భౌతిక కాయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి అనుమతించకపోవడం, దిల్లీలో స్మారకం ఏర్పాటుచేయకపోవడంపైన అప్పట్లో విమర్శలు వచ్చాయి. సోనియాతో పీవీ నరసింహారావుతో సరైన సంబంధాలు ఉండేవి కావని, ఒకరి పట్ల మరొకరు అనుమానంతోనే ఉండేవారని కాంగ్రెస్ సీనియర్ నేత మార్గరెట్ అల్వా స్వీయ చరిత్రలో ప్రస్తావించారు. పీవీ ప్రభుత్వంలో ఆమె సిబ్బంది వ్యవహారాల మంత్రిగా పనిచేశారు.'కరేజ్ అండ్ కమిట్‌మెంట్' పేరుతో ఆమె రాసుకున్న ఆత్మకథలో సోనియా, పీవీలకు సంబంధించిన ఆసక్తికర అంశాలను వెల్లడించారు."1992లో బోఫోర్స్ కేసులో పోలీసు ఫిర్యాదును కొట్టివేస్తూ దిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేయాలని పీవీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబ్రీ మసీదు ఘటన తర్వాత ఇద్దరి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది" అని ఆ పుస్తకంలో మార్గరెట్ అల్వా పేర్కొన్నారు.2024 ఫిబ్రవరిలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించింది. పీవీ శత జయంతి ఉత్సవాలను తెలంగాణలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది.నెక్లెస్ రోడ్డులో పీవీ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు నెక్లెస్ రోడ్డు పేరును 'పీవీ నరసింహారావు మార్గ్' అని పేరు మార్చింది.ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. గాంధీల కుటుంబంతో పీవీకి సత్సంబంధాలు లేవన్న వాదనలు ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటు విషయంలో ఎలా వ్యవహరిస్తోందో చూడాల్సి ఉంది."పీవీ తెలంగాణకు చెందిన వ్యక్తి. ఆయన విగ్రహం దిల్లీలో పెట్టాలనుకుంటే పెట్టుకోవచ్చు" అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు .అయితే, పీవీ విగ్రహం తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసేందుకు దిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ అనుమతించినా, విగ్రహ ఏర్పాటుకు స్థలం ఎక్కడనే విషయంపై స్పష్టత లేదు.ఆంధ్రప్రదేశ్ భవన్ ఉన్న ప్రాంతాన్ని విభజించి.. ఏపీ, తెలంగాణకు విడిగా భవనాలు నిర్మించనున్నారు.ఇప్పటికే ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం పక్కన ఏర్పాటు చేస్తారా, మరో ప్రదేశం గుర్తిస్తారా, మరొకచోటైతే అది ఏపీ భవన్ నిర్మించే వైపు వస్తుందా లేదా తెలంగాణ భవన్ వైపు ఉంటుందా..అనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

# భారత్, పాకిస్తాన్... వాణిజ్యం ఎవరికి లాస్

న్యూఢిల్లీ, మే 14, (న్యూస్ పల్స్) భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తానే అపినట్లు అమెకా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుగా ప్రకటించారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని వెల్లడించారు. రెండు రోజుల తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధాన్ని కూడా తానే ఆపినట్లు తెలిపారు. యుద్ధం ఆపకుంటే రెండు దేశాలతో వాణిజ్యం నిలిపివేస్తామని హెచ్చరించడంతో రెండు దేశాలు యుద్ధం ఆపాయని మరో ప్రకటన చేశారు. దీంతో ఇప్పుడు దీనిపై భారత్ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అమెరికా భారత్ పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తే నష్టపోయేది ఎవరు, లాభ పడేది ఎవరు అన్న అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.

భారత్‌పై ప్రభావం

భారత్?అమెరికా మధ్య 2021?22లో ద్వైపాక్షిక వాణిజ్యం 119.42 బిలియన్ డాలర్లు దాటింది, ఇందులో 76.11 బిలియన్ డాలర్లు ఎగుమతులు, 43.31 బిలియన్ డాలర్ల దిగుమతులు. అమెరికా భారత్‌కు ప్రధాన ఎగుమతి గమ్యస్థానం, మొత్తం ఎగుమతుల్లో 18% వాటా కలిగి ఉంది.

వాణిజ్యం ఆగిపోతే..

ఎగుమతి నష్టం: ఫార్మాస్యూటికల్స్, సాఫ్ట్‌వేర్ సేవలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలు భారీగా నష్టపోతాయి.

సేవల రంగం: భారత్ యొక్క ఐటీ మరియు బీపీవో సేవలు అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడతాయి. ౹ఎూ, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు గణనీయమైన ఆదాయాన్ని కోల్పోవచ్చు.

వ్యూహాత్మక నష్టం: అమెరికాతో రక్షణ ఒప్పందాలు మరియు సాంకేతిక భాగస్వామ్యం (ఉదా., డిఫెన్స్ టెక్నాలజీ షేరింగ్) ఆగిపోవడం వల్ల భారత్ యొక్క రక్షణ సామర్థ్యాలు దెబ్బతినవచ్చు.

పరోక్ష ప్రభావం: అమెరికా తన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తే, భారత్ ఇతర మార్కెట్ల (యూరోపియన్ యూనియన్, ఆసియా) వైపు మళ్లవచ్చు, కానీ ఈ పరివర్తనకు సమయం, వనరులు అవసరం.

భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు

భారత్ యొక్క వైవిధ్యమైన ఎగుమతి మార్కెట్లు (యూరోప్, మధ్యప్రాచ్యం, ఆసియా), దేశీయ ఆర్థిక వృద్ధి ఈ నష్టాన్ని కొంతవరకు తగ్గించగలవు. అమెరికా విధించే టారిఫ్‌లను ఎదుర్కోవడానికి భారత్ ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్ వంటి రంగాలలో తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదించవచ్చు.

పాకిస్థాన్‌పై ప్రభావం

పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ భారత్‌తో పోలిస్తే చిన్నది, అమెరికాపై ఎక్కువగా ఆధారపడుతుంది. అమెరికా పాకిస్థాన్‌కు ప్రధాన ఎగుమతి గమ్యస్థానం, ప్రధానంగా టెక్స్‌టైల్స్, కాటన్, లెదర్ ఉత్పత్తులు.

వాణిజ్యం ఆగిపోతే:

ఎగుమతి నష్టం: పాకిస్థాన్ యొక్క టెక్స్‌టైల్ రంగం, దాని ఆర్థిక వ్యవస్థలో 60% వాటా కలిగి ఉంది, తీవ్రంగా దెబ్బతింటుంది.

సైనిక సహాయం: అమెరికా నుండి సైనిక సహాయం (ఆయుధాలు, శిక్షణ) ఆగిపోతే, పాకిస్థాన్ యొక్క రక్షణ సామర్థ్యాలు బలహీనపడతాయి. ఇది భారత్‌తో సైనిక అసమానతను మరింత పెంచుతుంది.

ఆర్థిక సంక్షోభం: పాకిస్థాన్ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉంది, అమెరికా నుంచి ఆర్థిక సహాయం లేదా వాణిజ్యం ఆగిపోతే, దాని ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణిస్తుంది.

చైనా ఆధారం: పాకిస్థాన్ చైనా?పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ ద్వారా చైనాపై ఆధారపడవచ్చు, కానీ ఇది దీర్ఘకాల రుణ భారాన్ని పెంచుతుంది.

రాజకీయ, వ్యూహాత్మక నష్టం..

అమెరికా సహాయం లేకుండా, పాకిస్థాన్ యొక్క భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యత (ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ సరిహద్దులు) తగ్గవచ్చు. అమెరికా పాకిస్థాన్‌ను 'మేజర్ నాన్?నాటో అలై'గా గుర్తించినప్పటికీ, ఈ సంబంధం ఆగిపోతే, పాకిస్థాన్ అంతర్జాతీయంగా ఒంటరిగా మిగిలిపోవచ్చు.భారత్ నుండి ఫార్మాస్యూటికల్స్, ఐటీ సేవలు, పాకిస్థాన్ నుండి టెక్స్‌టైల్స్ వంటి దిగుమతులు ఆగిపోతే, అమెరికా సరఫరా గొలుసులు దెబ్బతింటాయి. ఉదాహరణకు, భారత్ నుంచి జనరిక్ ఔషధాలపై అమెరికా ఆధారపడుతుంది.

వ్యూహాత్మక నష్టం: భారత్‌ను ఒక ముఖ్యమైన భాగస్వామిగా (ఇండో?పసిఫిక్ వ్యూహంలో చైనాకు కౌంటర్‌గా) కోల్పోవడం వల్ల అమెరికా, ఆసియా ప్రాంతంలో ప్రభావం తగ్గుతుంది. పాకిస్థాన్‌తో సంబంధాలు ఆగిపోతే, ఆఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియాలో అమెరికా యొక్క గూఢచర్య సామర్థ్యాలు దెబ్బతినవచ్చు.

ప్రపంచ వాణిజ్యం: అమెరికా ఈ రెండు దేశాలతో వాణిజ్యాన్ని ఆపితే, ఇతర దేశాలు (చైనా, రష్యా) ఈ శూన్యతను పూరించే అవకాశం ఉంది, దీనివల్ల అమెరికా ప్రపంచ ఆర్థిక ప్రభావం తగ్గవచ్చు.

## ఎవరికి ఎక్కువ నష్టం?

పాకిస్థాన్: దాని చిన్న ఆర్థిక వ్యవస్థ, అమెరికాపై ఎక్కువ ఆధారం, ఇప్పటికే ఉన్న ఆర్థిక సంక్షోభం కారణంగా పాకిస్థాన్ అత్యధిక నష్టాన్ని చవిచూస్తుంది. చైనా సహాయం ఉన్నప్పటికీ, దీర్ఘకాల రుణ భారం, సైనిక బలహీనత పాకిస్థాన్‌ను ఎక్కువ ప్రమాదంలోకి నెట్టవచ్చు.భారత్: భారత్ కూడా నష్టపోతుంది, కానీ దాని వైవిధ్యమైన ఆర్థిక వ్యవస్థ, ఇతర మార్కెట్లతో సంబంధాలు, దేశీయ ఉత్పత్తి సామర్థ్యం వల్ల ఈ నష్టాన్ని తట్టుకోగలదు.

అమెరికా: అమెరికా ఆర్థికంగా కొంత నష్టపోతుంది, కానీ దాని ప్రపంచ ఆర్థిక ఆధిపత్యం మరియు ఇతర భాగస్వాములతో సంబంధాలు ఈ ప్రభావాన్ని తగ్గిస్తాయి.

# ఆత్మనిర్భర్ నిధి రుణాలకు బ్రేక్...

మెదక్, మే 14, :పట్టణ ప్రాంతాలలో చిరు, వీధి వ్యాపారులకు అం దించే ప్రధానమంత్రి స్వనిధి (ఆత్మనిర్భర్ నిధి) రుణాల ప్రక్రియలో ప్రధాన భూమిక పోషించే సైట్ మూడు నెలలుగా పని చేయ డం లేదు. దీంతో స్వనిధి రుణాలు అందడంలేదు. తొలి, మలి దశ రుణాల కోసం ఎదురు చూస్తున్న వీధివ్యాపారులు కొంత నిరాశకు గురవుతున్నారు.మున్సిపాలిటీల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధివ్యాపారులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తుంది. 2020లో కరోనా లాక్ డౌన్ నుంచి ఆత్మనిర్భర్ నిధి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద గుర్తించిన వీధి వ్యాపారులకు మొదటి విడతలో లబ్దిదారుడికి రూ.10 వేల రుణం అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ల ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమ చేశారు. చిన్న వ్యాపారులకు ప్రభుత్వం అందజేసే ఈ మొత్తం వారి జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడేది. ఐదేళ్ల కిందట ప్రతి వీధి వ్యాపారికి రూ.10 వేలు ఖాతాలో జమ చేయగా ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి వీలు కలిగేది. రెండో విడతలో రూ.20 వేలు అందించగా మూడో విడతలో దానిని రూ. 50 వేలకు పెంచారు. రుణం మొత్తం పెరుగుతూ ఉండ టం, వ్యాపారాభివృద్ధికి తోడుగా నిలవడంతో లబ్దిదారులు రుణం తీసుకోవడానికి మళ్లీమళ్లీ ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకర్లు సైతం ఈ రుణాలు సక్రమంగా చెల్లించినవారికి అందించేందుకు ముందుకొ చ్చారు. అయితే గత మూడు నెలలుగా రుణాలు అందించడంలేదు. దీంతో వారు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మనిర్భర్ నిధి పథకం కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించి మరీ రుణాలు అందిస్తుండగా ఇటీవల కొత్త పథకం అమలు చేసేందుకు వీలుగా సాంకేతికపరంగా ఆప్షన్ ఇవ్వక పోవడంతో పాతవారితో పాటు కొత్త వారికి కూడా రుణాలు అందించేందుకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు తెలుస్తోంది.కొత్త పథకం అమలు చేసేంత వరకు పీఎం స్వనిధి పథకం నిలిచిపోయినట్లుగానే భావిస్తున్నారు. అయితే వీధి వ్యాపారులకు రూ. 50 వేల వరకు ఇస్తున్న రుణాన్ని చెల్లించిన వారికి దానిని రూ.లక్షకు పెంచాలని పలువురు కోరు తున్నారు. దీంతో ఆర్థిక అవస రాలు తీరడంతో పాటు ఉపాధి పెరిగి జీవన ప్రమాణాలు మరింత పెరగనున్నాయని పలువురు భావిస్తున్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల పరిధిలో మొత్తం సుమారుగా పది వేల మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వారిలో తొలి విడతలో రూ.10 వేల రుణం పొందిన వారు సుమారు పది వేల వరకు ఉండగా రెండవ విడతలో రూ.20 వేల రుణం పొందిన వారు ఐదు వేలలోపు ఉన్నారు. మూడవ విడతలో రూ. 50 వేల రుణం పొందిన వారు కేవలం 1500 మంది ఉన్నారని సమాచారం. మూడవ విడత రుణం సక్రమంగా చెల్లించిన వారు ఈసారి రూ. లక్ష రుణం అందజేస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

# ట్రాక్టర్, బోలెరో ఢీ..ఒకరు మృతి



నల్గొండ మాడుగులపల్లి మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ను బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా వుంది,. నలుగురికి గాయాలు అయ్యాయి. మృతుడు మిర్యాలగూడ (మం) రుద్రారం గ్రామానికి చెందిన రామయ్య గా గుర్తించారు

# తారకరాముడికే గులాబీ పగ్గాలు

హైదరాబాద్, మే 14, తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలలో భారత రాష్ట్ర సమితి ఒకటి. ఇది రెండు పర్యాయాలు తెలంగాణలో అధికారాన్ని చలాయించింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించారు.. తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాదు.. భారత రాష్ట్ర సమితి కి అధ్యక్షుడిగా కేసీఆర్ కొనసాగారు. అధికారం పోయిన తర్వాత కూడా ఆయన అదే స్థానంలోనే ఉన్నారు. ఇక ఆయన కుమారుడు కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. పేరుకు కార్యనిర్వాహక అధ్యక్షుడైనా సరే.. ఇప్పటికీ పార్టీలో పెత్తనం మొత్తం కేటీఆర్ దే. కొన్ని విషయాలు మినహా.. అన్నింటిలోనూ కేటీఆర్ దే పెత్తనం సాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి పగ్గాలు కేటీఆర్ కు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కూడా ఎస్ అనే సమాధానమే చెబుతున్నారు. అయితే కెసిఆర్ కేటీఆర్ ను ఎప్పుడు పార్టీ ప్రెసిడెంట్ చేస్తారు? అనే ప్రశ్నకు మాత్రం ఇంతవరకు సమాధానం లభించడం లేదు.కేటీఆర్ ఒకవేళ పార్టీ ప్రెసిడెంట్ అయితే.. హరీష్ రావు పరిస్థితి ఏమిటి అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. అయితే దీనిపై స్వయంగా హరీష్ రావే క్లారిటీ ఇచ్చారు. భారత రాష్ట్ర సమితిలో కేటీఆర్ కంటే సీనియర్ నాయకుడు హరీష్ రావు. కేటీఆర్ కంటే కూడా మొదటి నుంచి ఆయన ఉద్యమంలో ఉన్నారు. అయితే ఎప్పుడైతే కేటీఆర్ భారత రాష్ట్ర సమితిలో చేరారో.. అప్పట్నుంచి హరీష్ రావుకు సమాంతర నాయకుడిగా ఎదగడం మొదలుపెట్టారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కీలక శాఖలకు మంత్రిగారి పని చేశారు. ఒకరకంగా షాడో ముఖ్యమంత్రిగా ఉన్నారని ప్రచారం కూడా జరిగింది. అయితే అప్పట్లో అనేక సందర్భాల్లో పార్టీలో విభేదాలు చోటుచేసుకున్నాయని.. హరీష్ రావు వేరు కుంపటి పెడుతున్నారని ఆరోపణలు వినిపించాయి. అయితే దానిని హరీష్ రావు నిర్ద్వంద్వంగా కొట్టి పారేశారు. అయితే ఇప్పుడు మరోసారి హరీష్ రావు విలేకరులకు ముందుకు వచ్చి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.." కెసిఆర్ పార్టీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఇబ్బంది లేదు. కేటీఆర్ ను అధ్యక్షుడిని చేస్తే నాకు వచ్చిన నష్టం లేదు. కెసిఆర్ మాటే నాకు శిరోధార్యం. పార్టీలో ఆయన ఎలాంటి పని చేయమన్నా నేను చేస్తాను. పార్టీలో విభేదాలు ఉన్నాయనేది అబద్ధం. ఇలాంటి ప్రచారం ఎప్పటినుంచో సాగుతోంది. ఇలాంటి ప్రచారాలను చూసుకుంటూనే అధికారంలోకి వచ్చాం. ఏకంగా రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించాం. ఇలాంటి వాటిని వినడం మాకు కొత్త కాదు. పార్టీ మొత్తానికి కెసిఆర్ బాస్. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పని చేయడానికి నేను సిద్ధమని" హరీష్ రావు స్పష్టం చేశారు. మొత్తంగా ఆయన పార్టీలో విభేదాలు లేవని స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ జరగాల్సిన ప్రచారం జరుగుతూనే ఉంది

# సిటీలో ట్రాఫిక్ చెక్..

హైదరాబాద్, మే 14, బేగంపేట ఫ్లైఓవర్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి బల్దియా రూ.14.6 కోట్లతో మరమ్మతులు చేపట్టనుంది. ఈ మేరకు టెండరు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అలాగే.. కంటోన్మెంట్‌లోని ఆర్.కె.పురం ఆర్వోబీ మరమ్మతులకు కూడా టెండరు నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఈ రెండు పనులను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు జరుగుతున్న సమయంలో వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేయాల్సి ఉంటుంది.. కాబట్టి ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.బేగంపేట ఫ్లైఓవర్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి.. బల్దియా రూ.14.6 కోట్లతో మరమ్మతులు చేపట్టనుంది. ఈ మేరకు ప్రాజెక్టుల విభాగం టెండరు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతోపాటు.. కంటోన్మెంట్‌లోని ఆర్.కె.పురం ఆర్వోబీ మరమ్మతులకు కూడా టెండరు నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఈ రెండు పనులను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు జరుగుతున్న సమయంలో వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేయాల్సి ఉంటుంది.. కాబట్టి ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాల్సి వస్తుంది.బేగంపేట రైల్వే స్టేషన్ వద్ద ఈ ఫ్లైఓవర్‌కు 1980లో అప్పటి ముఖ్యమంత్రి టి. అంజయ్య శంకుస్థాపన చేశారు. ఇది మూడు సంవత్సరాలలో పూర్తయింది. సికింద్రాబాద్ , బేగంపేట మధ్య ప్రయాణ సౌలభ్యం పెరిగినప్పటికీ.. రద్దీ రోజురోజుకూ పెరగడంతో కొన్ని సంవత్సరాల తర్వాత పాత సీఎం క్యాంపు కార్యాలయం నుండి ఆర్వోబీని అనుసంధానం చేస్తూ మరొక వంతెనను నిర్మించారు. అయితే.. 40 సంవత్సరాల నాటి పిల్లర్ల మధ్య స్లాబుల అంచులు దెబ్బతినడం, స్లాబుల మధ్య దూరం పెరగడం .. పిల్లర్లపై బేరింగులు దెబ్బతినడంతో వంతెన ప్రమాదకరంగా మారింది. బేరింగులను మార్చి స్లాబులు.. గడ్డర్లను సరిచేస్తారు, అలాగే ఇంజెక్షన్ విధానంలో ఫైన్ సిమెంటును దెబ్బతిన్న కాంక్రీటు దిమ్మెల్లోకి పంపి మైక్రో కాంక్రీటింగ్‌తో పగుళ్లకు మరమ్మతులు చేస్తారు.బేగంపేట ఆర్వోబీ కింద రెండు నిరాశ్రయుల కేంద్రాలు ఉన్నాయి.. వాటిలో దాదాపు 200 మంది ఆశ్రయం పొందుతున్నారు. మరమ్మతుల సమయంలో వారిని ఇతర కేంద్రాలకు తరలించాలని కోరుతూ బల్దియా ఇంజనీర్లు అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యుసిడి) అధికారులకు లేఖ రాశారు. రెండేళ్లపాటు ఆ కేంద్రాలను ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం లేదా పూర్తిగా తొలగించే మార్గాలను జిహెచ్ఎంసి పరిశీలిస్తోంది.ఈసిఐఎల్ , సైనిక్‌పురిని కంటోన్మెంట్‌తో కలిపే ఆర్.కె.పురం ఆర్వోబీ కూడా చాలా సంవత్సరాల క్రితం నిర్మించినదే. పగుళ్ళ , స్లాబుల మధ్య దూరం పెరగడంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. లాలాపేట, అడిక్‌మెట్ ఆర్వోబీల మాదిరిగానే ఆర్.కె.పురం ఆర్వోబీకి కూడా రూ.4.6 కోట్లతో మరమ్మతులు నిర్వహిస్తామని జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. ఈ మరమ్మత్తులు పూర్తయితే.. ఈ ప్రాంతాలలో వాహనాల రాకపోకలు సురక్షితంగా.. సజావుగా సాగుతాయని భావిస్తున్నారు.

# రైతులతో ఆడుకుంటున్న మిల్లర్లు

మహబూబ్ నగర్, మే 14, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నప్పటికీ అధికారుల అలసత్వం రైతులకు శాపంగా మారుతోంది. ప్రాథమిక సహకార సంఘం, ఐకెపి, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల మధ్య కొరవడిన సమన్వయ లోపంతో వరి కొనుగోలు ఆలస్యం చేస్తూ చివరికి అకాల వర్షానికి ధా న్యం తడిసి అపారమైన నష్టాన్ని మిగులుస్తోంది.చెమటోడ్చి కుటుంబమంతా కష్టపడి పండించిన పంటను అమ్ముకునే దశలోనే అ ధికారులు అలసత్వంతో రెక్కల కష్టం పూర్తి గా వర్షార్పణమవుతుంది. అక్కడక్కడ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కొనుగోలు కేం ద్రాలను సందర్శిస్తూ పలు సూచనలు సలహాలు ఇస్తూనే హెచ్చరికలు సైతం జారీ చేశా రు.అయినప్పటికీ జిల్లా కలెక్టర్ ను సైతం లెక్కచేయకుండా సరైన సమయంలో గన్ని బ్యాగులు, టార్పిలీన్ ల్ల కొరత, ధాన్యం తరలింపు లారీల కొరత మార్కెట్కు ధాన్యాన్ని తీసుకు వచ్చినప్పటికీ కొనుగోలు చేయడం లో అలసత్వం ఇలాంటి కారణాలవల్ల రైతు లు పండించిన ధాన్యం వర్షానికి తడిసి వర ద పాలవుతోంది. జిల్లాలోని 4 నియోజకవర్గాల వారీగా ఈ రభీ సీజన్ వరి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా మిల్లులకు తరలించేందుకు లారీల ఏర్పాటుకు టెండర్లను పిలి చారు.రాజకీయ పార్టీల నేతలు తెరవెనుక లారీల తరలింపు అంశంలో కమిషన్లకు కక్కు ర్తి పడి లారీ డ్రైవర్లతో లారీ ఓనర్ అసోసియేషన్ పేర్లతో రాజకీయం చేస్తూ సరైన సం ఖ్యలో లారీలను ఏర్పాటు చేయకపోవడం తో చివరికి రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా కిందిస్థాయి అ ధికారుల అలసత్వం వెరిసి రైతులకు నష్టాన్ని తెచ్చి పెడుతోంది.అక్కడక్కడ కొ నుగోలు కేంద్రాలను సందర్శించే క్ర మంలోనూ ఫోటోలకు ఫోజులిస్తూ కంటి తు డుపుగా తనిఖీలు చేయడంతో చివరికి ఎక్కడ వేసినగొంగడి అక్కడే అన్న చందంగా ఆయా కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు అక్కడే తిష్ట వేసి ఉన్నాయి. సోమవారం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సివిల్ సప్లై ఐకెపి, పిఎసి ఎస్, వంటి శాఖలతో పాటు కిందిస్థాయి సి బ్బందితో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వరి కొనుగోలు అలసత్వంపై ప్రత్యేక సమీక్ష జరిపారు. ధాన్యం సరఫరాకు ఏర్పా టు చేసే లారీల కొరత ఎందుకొస్తుందంటూ ప్రశ్నించారు.గన్ని బ్యాగులను కృత్రిమ కొరత సృష్టించడం ఏంటని నిలదీశారు. లారీలకు జిపిఎస్ ట్రా కింగ్ సిస్టం వెంటనే ఏర్పాటు చేయాలని ధాన్యం సరఫరా కో సం లారీలపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. అయి నా సంబంధిత అధికారు లు మాత్రం అలసత్వాన్ని వీడటం లేదు. తే మ, తాలు వంటి సాకులు చూపి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం ఆయా రైస్ మిల్లర్లు అన్లోడింగ్ అనుమతించడం లేదని తద్వారా లారీలన్నీ ఆ యా రైస్ మిల్లర్ల వద్దే పడిగాపులు తప్పడం లేదని ఆయా లారీ కాంట్రాక్టర్లు చెప్తున్నారు.ఆయా రైస్ మిల్లర్లతో అధికారులు కుమ్మక్కై రైతులను ఇబ్బందులు పెడుతున్నా పట్టించుకోవడం లేద నే ఆరోపణలు పెరుగుతున్నాయి. కేవలం కొన్ని మి ల్లుల కు మాత్రమే ఎక్కువ శాతం దాన్యం కేటాయిస్తున్నారని దాని వెనక ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# పల్లెలకు హెచ్ ఎఎం విధానంలో కొత్త రోడ్లు

కరీంనగర్, మే 14, సిరిసిల్ల జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. మొదటి దశలో 136.2 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మండల కేంద్రాలను జిల్లా కేంద్రంతో అనుసంధానించేలా హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో రహదారులను నిర్మిస్తారు. దీంతో ఆయా కేంద్రాల నుంచి నిర్మించే రహదారుల వల్ల పల్లెల రూపు రేఖలు మారనున్నాయి. ఏ ఏ ప్రాంతాల్లో ఈ కొత్త రహదారులను అభివృద్ధి చేయనున్నారో ఇక్కడ తెలుసుకోండి.సిరిసిల్ల జిల్లాలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. వివిధ మండల కేంద్రాలను జిల్లా కేంద్రంతో అనుసంధానించే లక్ష్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో రహదారులను నిర్మించనున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా బోయినపల్లి మండలం శాబాష్‌పల్లి నుండి నమిలికొండ వరకు 17.3 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ఇది ఈ ప్రాంతంలోని గ్రామాల మధ్య అనుసంధానతను మెరుగుపరుస్తుంది. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల కూడలి నుండి ఇల్లంతకుంట వరకు 16.0 కిలోమీటర్ల రహదారిని నిర్మించనున్నారు. దీని వలన స్థానిక వాణిజ్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి.సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిలో మాచారెడ్డి నుండి ముస్తాబాద్ వరకు 38.8 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ఇది ప్రాంతీయ రవాణాకు ఎంతో కీలకం కానుంది. సిరిసిల్ల-ముస్తాబాద్ రహదారిలో నామాపూర్, వెంకటాపూర్, మరియు అవునూరు మీదుగా 12.4 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు.. ఇది ఈ గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందిస్తుంది.వేములవాడ -కోరుట్ల మధ్య 26 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు.. ఇది రెండు పట్టణాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుంది. చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు 10.6 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు.. ఇది ఈ ప్రాంతంలోని రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తుంది. సిరిసిల్ల నుండి కోనరావుపేట , మరిమడ్ల రహదారి వరకు 4.6 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు.. వేములవాడ పట్టణంలోని మూలవాగు నుండి చింతల్ఠానా ఆర్‌డఆర్ కాలనీ వరకు 4.3 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు.ఈ రహదారుల నిర్మాణం పూర్తయిన తర్వాత.. సిరిసిల్ల జిల్లాలో రవాణా వ్యవస్థ గణనీయంగా మెరుగుపడుతుంది. ఇది స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే కాకుండా.. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుంది.

# బయటకు అఘోరి రాసలీలలు

హైదరాబాద్, మే 14, (న్యూస్ పల్స్) గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరి పేరు మార్మోగిపోతుంది. ఇప్పటికే తాంత్రిక పూజల పేరుతో ఓ మహిళ వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన కేసులో జైలులో రిమాండ్‌లో ఉంది. అంతేకాక అఘోరి శ్రీవర్షిణి కన్నా ముందే తనను పెళ్లి చేసుకుందంటూ మొదటి భార్య రాధిక పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. పైగా ఇప్పటికి కూడా అఘోరి ఆడా.. మగా అనే అంశంపై క్లారిటీ రాలేదు. ఇదిలా ఉంటే ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న అఘోరిపై మరో కేసు నమోదయ్యింది. ఈసారి అత్యాచారం కేసు ఫైల్ కావడం గమనార్హం. ఈ కేసు కరీంగనర్ జిల్లా, కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు.లేడీ అఘోరి రి తనకు బలవంతంగా తాళి కట్టిందని.. అంతేకాక తనపై అత్యాచారం ప్రయత్నం కూడా చేసిందంటూ ఓ యువతి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సనాతన ధర్మం పేరుతో అఘోరి బాధితురాలితో పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత తనను ట్రాప్ చేసి.. ప్రేమించానని మాయ మాటలు చెప్పిందని బాధితురాలు ఆరోపించింది. అంతటితో ఆగక.. తనను బలవంతంగా కొండగట్టు తీసుకెళ్లి మెడలో తాళి కూడా కట్టిందని పోలీసులకు తెలిపింది. ఆపై తనపై అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నం చేసిందని.. తన ప్రైవేట్ పార్ట్స్‌పై చేతులు వేసిందని బాధితురాలు ఆరోపించింది.


అంతటితో ఆగకుండా తనను బెదిరించి రూ.3 లక్షల రూపాయలు తీసుకుందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో వెల్లడించింది. ఈ విషయాన్ని బయటపెడితే చంపేస్తానంటూ బెదిరించిందని పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అఘోరీపై 64(1), 87 318(4) 351(2) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్థిక మోసం కేసులో ఇప్పటికే పోలీసుల రిమాండ్‌లో ఉన్న అఘోరిని ఈ కేసుకు సంబంధించి కూడా విచారించే అవకాశముంది అంటున్నారుహైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఇటీవల అఘోరిపై మోకిలా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాంత్రిక పూజల పేరుతో తన వద్ద రూ.9.5 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీంతో రంగంలోకి దిగిన మోకీలా పోలీసులు.. అఘోరిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం దీనిపై విచారణ జరుగుతోంది. మరోవైపు అఘోరికి మె?దటి భార్య తానేనంటూ రాధిక అనే మహిళ ఇటీవల మీడియా ముందుకు వచ్చింది. ఇదిలా ఉంటూ.. అఘోరీ.. శ్రీవర్షిణి అనే యువతిని సైతం పెళ్లి చేసుకుంది. అఘోరి లీలలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. ఇంకెంతమంది బాధితులు బయటకు వస్తారో చూడాలి మరి అంటున్నారు జనాలు.

# సరస్వతి పుష్కరాలకు స్పెషల్ బస్సులు

హైదరాబాద్, మే 14, సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని చుఉూఖీఅ యాజమాన్యం నిర్ణయించింది. ఏబూ, ఓఉబూ, ఉప్పల్, కూకట్ పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ సహా నగరంలో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. 40 మంది కలిసి పుష్కరాలకు వెళ్లాలని అనుకుంటే వారికోం ప్రత్యేక బస్సులు పంపేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం ష్ట్రబిబిజూ://బిణబతీబిఇ.ఎబీబ.తిని వెబ్ సైట్ ని సంప్రదించండి.పన్నెండేళ్లకోసారి జరిగే పవిత్రమైన పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితంగా వారంతా పుష్కర స్నానం ఆచరించేలా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గ్రేటర్ హైదరాబాద్ జోన్ టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఈ నెల 14 బుధవారం నుంచి 24వరకు ప్రత్యేక బస్సులను నడపనుందిభక్తుల రద్దీకి అనుగుణంగా ఈ బస్సులు ప్రధాన పుష్కర ఘాట్లకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారుగ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాలైన జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, కూకట్ పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ నుంచి మెట్రో డీలక్స్ బస్సులు నడుపనున్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా.. ఒకే కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే ఆ కాలనీకే బస్సు పంపించే ఏర్పాట్లు చేశారు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు. ఇలాంటి ప్రత్యేక బస్సుల కోసం 9676671533, 9959226154, 9959226160 నంబర్లు సంప్రదించండి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 790 ప్రత్యేక ఖీఅ బస్సులు ఈ పుష్కరాలను వెళ్లనున్నాయి పుష్కరాల కోసం పోలీసుల పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసారు..మొత్తం 3 షిఫ్టుల్లో సుమారు 3500 మంది పోలీసుల విధులు నిర్వహిస్తారుపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి మే 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగనున్నాయి. మే 15 ఉదయం 5 గంటల 44 నిముషాలకు సరస్వతీ పుష్కరాలను శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఘనంగా ప్రారంభిస్తారు. ఇదే రోజు సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకుంటారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. పుష్కరస్నానం ఆచరించిన తర్వాత కాళేశ్వరం ఆలయాన్ని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత విగ్రహావిష్కరణ, గోదావరి హారతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్

## -నేడు ఆయన జయంతి



మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్ధ్ కాటన్. మదరాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయమైన విజయాలు సాధించాయి. సర్ ఆర్థర్ కాటన్ దూరదృష్టి, సునిశిత మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత సర్ ఆర్థర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది.

1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 సం?? నికి ఆర్థర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించారు. 1821 లో 18 సం?? ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సం??లో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సం?? వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన థామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది.

1828 – 29 సం?? లలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది. 1832 లో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సం?? లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అద్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 సం??లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881 వ సం??లో ప్రచురించిన "వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వల దారా పారించవచ్చును. "ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్థర్ కాటన్ చూపిన ప్రతి భాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యారేజి నిఢిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్బ్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహోదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది.

ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పథకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయనను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

# మెడికల్ కాలేజీలకు రేటింగ్

హైదరబాద్, మే 14, దేశంలోని మెడికల్ కాలేజీల ర్యాంకింగ్స్ కోసం ఇప్పటివరకు ప్రత్యేకంగా ఒక వ్యవస్థ అంటూ లేదు. కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ర్యాం కింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) చేసే సర్వేనే ఇన్నాళ్లు దేశంలోని అన్ని విద్యాసంస్థలకు ప్రామాణిక రేటింగ్, ర్యాంకింగ్‌గా ఉంటూ వస్తోంది.

అయితే ఇటీవల ఈ ర్యాంకింగ్ విధానంపైనా పలువురు పెదవివిరుస్తున్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాం కింగ్స్ అంత సమగ్రంగా ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పలు ప్రైవేట్ కాలేజీలు ఈ ర్యాంకింగ్ విధానంపై సర్వే చేసే ప్రొఫెసర్లను మేనేజ్ చేస్తూ స్థాయి లేకపోయినా అత్యుత్తమ ర్యాంకింగ్స్ ఉన్నట్లుగా చూయించుకుంటున్నాయనే ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలో ఓ ప్రముఖ ప్రైవేటు ఇంజినీరింగ్ యూనివర్సిటీ ఇదే పంథా అనుసరిస్తూ ర్యాంకింగ్స్ నిర్ధారించేందుకు వచ్చే ప్రొఫెసర్లకు లంచాలు ఇస్తూ సీబీఐకి దొరికిపోయిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఎన్ఐఆర్ఎఫ్ ప్రైవేటు మెడికల్ కాలేజీలకు తప్పనిసరి కాదు..ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తప్పనిసరి అయినా ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఇందులో పాల్గొనాలనే నిబంధన లేదు. అందుకే ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఈ ర్యాంకింగ్ సిస్టంకు దూరంగా కూడా ఉంటున్నాయి. రాష్ట్రం నుంచి ఈ ర్యాంకింగ్ వ్యవస్థలోకి కేవలం 3 ప్రైవేటు మెడికల్ కాలేజీలు మాత్రమే పాల్గొనగా అందులో ఒక్క కాలే జీ కూడా టాప్ 100ర్యాంకింగ్స్‌లో లేదు.ఉస్మానియా మెడికల్ కాలేజీ మాత్రమే దేశంలో 48వ ర్యాంకులో నిలిచి సత్తాచాటింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెడికల్ కాలేజీలకు సరిపోయే విధంగా లేవని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) భావి స్తోంది. దీనికి తోడు కచ్చితంగా ప్రతీ మెడికల్ కాలేజీ కూడా తమ కాలేజీ ర్యాంకింగ్ విధానాన్ని అందరికీ తెలిపేందుకు ఈ సర్వేలో పాల్గొనాలనే నిబంధన ప్రవేశపెట్టడం ద్వారా మెరుగైన వైద్యవిద్యకు అవకా శం ఏర్పడుతుంది.థర్డ్ పార్టీ సర్వే వల్ల డొల్ల కాలేజీలను గురించి విద్యార్థులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. వైద్యవి ద్యను మరింత బలోపేతం చేసేందుకు, వైద్య విద్యార్థులు తమ ర్యాంకును బట్టి మరింత మెరుగైన కాలేజీని ఎంపిక చేసుకునేందుకుగాను అత్యుత్తమ ర్యాంకింగ్, రేటింగ్ ఇచ్చేందుకు గాను థర్డ్ పార్టీ విధానాన్ని అత్యంత కచ్చితత్వంతో అమలులోకి తీసుకొచ్చేందుకు ఎన్ఎంసీ నిర్ణయించింది.ఇందుకుగాను 11 ప్రమాణాలు, 78 నిబంధనలతో ర్యాంకింగ్ సిస్టం అభివృద్ధి చేసేం దుకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన గుర్తింపు, ర్యాంకింగ్, రేటింగ్స్ కోసం విధివిధానాలపై ప్రజాభిప్రాయాన్ని సైతం ఎన్ఎంసీ కోరుతోంది. ఎన్ఎంసీ, కరికులం అమలు, క్లినికల్ ఎక్స్‌పోజర్, క్లినికల్ ఫెసిలిటీస్, ఇంటర్న్‌షిప్, సౌకర్యాలు, మానవవనరులు, నీట్ యూజీ, పీజీ ఎంట్రన్స్‌లో విద్యార్థుల ర్యాంకింగ్స్, తదితర అంశాలను థర్డ్ పార్టీ బృందం సర్వే చేసి నిర్ధారించుకుంటుంది. సామర్థ్య ఆధారిత పాఠ్యాంశాల అమలును పరిశీలించి కళాశాలల్లో థియరీ, ప్రాక్టికల్ అనుభవాలను ఎలా సమన్వయం చేస్తున్నారో కూడా అంచనా వేస్తారు.ప్రీ క్లినికల్, పారా క్లినికల్, క్లినికల్ సబ్జెక్టుల మధ్య సమన్వయం ఎలా ఉందో కూడా ఈ థర్డ్ పార్టీ సర్వేలో తేలుతుంది. కళాశాలల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ రివై జ్డ్ బేసిక్ వర్క్‌షాప్ (ఆర్‌బీసీడబ్ల్యూ)లాంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారో లేదో కూడా ఈ బృందం పరిశీలిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎన్ని ఒప్పందాలు చేసుకు న్నారనే అంశాలకు వెయిటేజీ ఉంటుంది.ఓపీ హాజరు, మైనర్ సర్జరీలు, ల్యాబ్ టెస్టులు, రోజువారీ రోగుల రాక, ఎమర్జెన్సీ వైద్యసేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు, టీచింగ్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక పరికరాలు, తగినంత టీచింగ్ ఫ్యాకల్టీ, సిబ్బంది సేవలు ఉన్నాయో లేవో కూడా పరిగణలోకి తీసుకుంటారు.

ఈ ముసాయిదాపై సలహాలు, సూచనలు, అభిప్రాయా లను 21రోజుల్లోగా ఆన్‌లైన్ ద్వారా పంపించాలని ఎన్ఎంసీ కోరుతోంది.మెడికల్ అసె స్మెంట్ బోర్డు (ఎంఏఆర్‌బీ), క్వాలిటీ కౌన్సి ల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) మధ్య ఇప్పటికే థర్డ్ పార్టీ రేటింగ్స్ వ్యవస్థ కోసం ఓ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 11 విభిన్న ప్ర మాణాలు, 92 నిబంధనలపై సర్వే నిర్వహించనున్నారు.వైద్య విద్య ప్రమా ణాలు మరింతగా పెంచాలని ఎన్ఎంసీ కో రుకుంటోంది. సరైన రేటింగ్స్ ఉండే కాలేజీలను విద్యార్థులు ఎంచుకునేందుకు అవకా శం లభిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

## బీజేపీలో చేరిన మండలి డిప్యూటీ ఛైర్ పర్సన్ జకీయా ఖానమ్

విజయవాడ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ మయానా జకీయా ఖానమ్ బిజెపి రాష్ట్ర కార్యాలయం చేరుకుని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తో భేటీ అయ్యారుబిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి కాషాయ కండువా కప్పి పార్టీలోకి జకియాను ఆహ్వానించారు. రాష్ట్ర మంత్రి వై సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ , కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి, ఆర్టీసీ చైర్మన్ సురేష్ రెడ్డి తదితరులు వేదిక మీద ఉండగా జకీయా పార్టీ లో చేరారు.

# నేడు అంతర్జాతీయ కుంటుబ దినోత్సవం





ప్రతి ఏట మే 15న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నిర్వహిస్తారు. నేటికాలంలో సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న ఈ నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలియజేయడంకోసం ఈ కుటుంబ దినోత్సవం నిర్వహించబడుతుంది.

గతంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండడంలేదు. ఈ పరిణామం వల్ల ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావడం, పట్టించుకునేవారు లేకపోవడంతో మహిళలపై పనిభారం పెరిగి వారి ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనమవ్వడం మూలంగా సమాజంలో జరిగే దుష్పరిణామాలు గ్రహించిన ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడంకోసం 1993, మే 15న అంతర్జాతీయ కుంటుబ దినోత్సవం ప్రారంభించింది.

## నేడు భారత స్వాతంత్రోద్యమ విప్లవ వీరుడు సుఖ్ దేవ్ జయంతి

## భారత స్వాతంత్రోద్యమ విప్లవ వీరుడు




సుఖ్ దేవ్ థాపర్ లూధియానాలో 15 మే 1907 జన్మించారు. ఈయన భారత స్వాతంత్ర్య సమర, ఉద్యమకారుడు. ఇతను భగత్ సింగ్, రాజ్‌గురు ల సహచరునిగా ప్రసిద్ధి. 1928 లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ ప్రభుత్వం పై పగతీర్చుకోవడానికి, ఫిరోజ్ పూర్ లో బ్రిటిష్ పోలీసు అధికారి "జె.పి. సాండర్స్" ను హతమార్చినందులకు గాను మార్చి 23 1931 న అతి చిన్న వయసులో ఉరితీయబడ్డాడు. భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు విప్లవకారులను 1931 మార్చి 23న లాహోరు సెంట్రల్ జైలులో సాయంకాలం గం. 7.33 ని.లకు సమయానికి ఉరి తీశారు. అప్పటి నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఉరిశిక్ష అమలు జరపడం జరిగేది కాదు. వారి మృత దేహాలను రహస్యంగా, జైలు వెనుక గోడలు పగులగొట్టి తీసికొని వెళ్ళి సట్లెజ్ నది తీరాన హుస్సేన్‌వాలా అనే ఊరిలో దహనం చేసేవారు. మృత దేహాలను చూసిన ప్రజలలో అలజడిని ఎదుర్కోకుండా ఇలా చేశారు.

## జర్నలిస్టు కాలనీ స్థలం కబ్జా ను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు బెల్లంపల్లి తహసిల్దార్ జోష్ణ



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ మే14** : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాల జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న జర్నలిస్టు కాలనీ స్థలంలో కొద్ది రోజుల క్రితం గుర్తు తెలి యని వ్యక్తులు ప్లాటింగ్ చేసి హద్దు రాళ్ళను ఏర్పాటు చేయడంతో రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు.వివరాల్లోకి వెళితే గత కొన్ని రోజుల కిందట జర్నలిస్టు కాలనీ లోని స్థలంలోకొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా సిమెంటు పోల్స్ పాతిస్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు (టేకులబస్తీ)జర్నలిస్టు కాలనీకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత తహసిల్దార్,ఆర్డీవో,జిల్లా కలెక్టర్లను విషయాన్ని వివరించి స్థలాన్ని రక్షించి అర్హులైన జర్నలిస్టులకు సంబంధిత స్థలాన్ని కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయడం జరిగింది. స్పందించిన బెల్లంపల్లి తహసీల్ జోష్ణ ఆదేశాల మేరకు బెల్లంపల్లి రెవెన్యూ ఆర్ఐ మురళీదర్ రెవెన్యూ సిబ్బంది సహాయంతో స్థలంలో పాతిన సిమెంట్ పోల్స్ ను తొలగించారు. ఉన్నతాధికారులు స్థానిక ఎమ్మెల్యే స్పందించి జర్నలిస్టు కాలనీ స్థలాన్ని రక్షించినందుకు బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సదానందం కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తాసిల్దార్ జోష్ణ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా హామీ హెచ్చరించారు.ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలను వెలికి తీసుకున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ జర్నలిస్టు కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 20 రోజుల రాజన్న హుండీ లెక్కింపు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజున 20 రోజుల హుండీ లెక్కింపు జరిగింది. ఇట్టి లెక్కింపులో 1 కోటి,65 లక్షల 84 వేల 607 నగదు రూపాయలు, బంగారం204 గ్రాముల500 మిల్లి గ్రాములు, వెండి13 కిలోల200 గ్రాముల ఆదాయం రాజన్న ఆలయానికి చేకూరింది.

రాజన్న ఆలయ ఈవో కే.వినోద్ రెడ్డి, మరియు కరీంనగర్ సహాయ కమిషనర్ కార్యాలయ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ ఉద్యోగులు, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి వారిచే లెక్కించడం జరిగింది.

ఎస్పీఎఫ్ మరియు హెూంగార్డులు భద్రతా చర్యలు నిర్వహించారు.

# ట్రంప్ మధ్యవర్తిత్వం క్రెడిట్

భారతదేశం, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఘనతను అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ తీసుకుంటున్నారు.అమెరికాతో వాణిజ్యం కారణంగానే ఇరుదేశాలు కాల్పుల విరమణ చేశాయని ఆయన ఇప్పుడు కొత్త వాదన చేస్తున్నారు.అయితే ,పాకిస్తాన్‌తో సంఘర్షణ సమయంలో అమెరికాతో జరిపిన చర్చలలో వాణిజ్యం గురించిన ప్రస్తావన రాలేదు.కాల్పుల విరమణకు సంబంధించి ఇండియా ఇప్పటివరకు ఇచ్చిన సమాచారంలో ఎక్కడా అమెరికా పేరు చెప్పలేదు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది పౌరులు మరణించిన తరువాత భారతదేశం, పాకిస్తాన్ మధ్య సంబంధాలు క్షీణించాయి.ఈ దాడుల తర్వాత, భారతదేశం పాకిస్తాన్‌తో అన్నిరకాల వాణిజ్యాన్ని నిషేధించింది.అయితే భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను ఆదివారం సాయంత్రం సోషల్ మీడియాలో తొలుత ప్రకటించింది అమెరికా అధ్యక్షుడే. దీనితో పాటు, మరుసటి రోజు సోమవారం, రెండు దేశాల సరిహద్దుల్లో శాంతిని నెలకొనడాన్ని ఆయన ప్రశంసించారు.డోనల్డ్ ట్రంప్ ప్రతిరోజూ కొత్త వాదనలు చేస్తున్నారు. సోమవారం వైట్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో.. కాల్పుల విరమణ కోసం భారత్, పాకిస్తాన్‌లపై ఒత్తిడి తెచ్చానని, ఇది జరగకపోతే, రెండు దేశాలతో వాణిజ్యాన్ని ముగిస్తానని పేర్కొన్నట్లుగా ట్రంప్ తెలిపారు.వాణిజ్యం కారణంగా ఈ ఘర్షణను ముగించడానికి భారతదేశం, పాకిస్తాన్ అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు.చాలా ప్రమాదకరమైన అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల మధ్యన పూర్తి కాల్పుల విరమణ తీసుకురావడానికి నా పరిపాలన సహాయపడింది" అని డోనల్డ్ ట్రంప్ అన్నారు. "మేం వారికి ఎంతో సాయం చేశాం. వాణిజ్యంలోనూ సాయపడ్డాం."మీతో చాలా వ్యాపారం చేయబోతున్నామని చెప్పాను. దీన్ని వెంటనే ఆపండి, మీరు దీన్ని ఆపేస్తే వ్యాపారం జరుగుతుంది. మీరు దీన్ని ఆపకపోతే మేం మీతో ఎలాంటి వ్యాపారం చేయబోం" అని చెప్పానని ట్రంప్ తెలిపారు.వారు ఇది అనేక కారణాల వల్ల చేసి ఉండొచ్చు, కానీ వాణిజ్యమే అతి పెద్ద కారణం" అని ఆయన చెప్పారు.పాకిస్తాన్,భారత్‌లతో మేం చాలా వ్యాపారం చేయబోతున్నాం. ప్రస్తుతం భారతదేశంతో చర్చలు జరుపుతున్నాం. త్వరలో పాకిస్తాన్‌తోనూ చర్చలు జరుపుతాం. మేం అణు యుద్ధాన్ని నివారించామనుకుంటున్నాను." అని డోనల్డ్ ట్రంప్ తెలిపారు.రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, డోనల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత చైనా, భారతదేశం సహా అనేక దేశాలపై సుంకాలను విధించారు. ఆ తరువాత ఈ సుంకాలను అమలు చేయడానికి గడువు పొడిగించారు.కాల్పుల విరమణను అంగీకరించడంలో వాణిజ్యం ప్రముఖపాత్ర పోషించిందన్న ట్రంప్ వాదనపై భారత్ ఇంకా అధికారికంగా స్పందించలేదు.పాకిస్తాన్‌తో ఘర్షణ సమయంలో అమెరికా ప్రతినిధులతో భారతదేశం జరిపిన చర్చలన్నింటిలో ఎక్కడా వాణిజ్యం లేదా వ్యాపారం గురించి ప్రస్తావించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.మే 6-7 తేదీల మధ్యరాత్రి పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌పై భారతదేశం దాడి చేసిన తర్వాత అమెరికాతో వివిధ స్థాయిలలో చర్చలు జరిగాయని" విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.మే 8న, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి ఎస్.జైశంకర్‌తో మాట్లాడారు.మే 9న, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడారు.మే 10 ఆదివారం , అమెరికా విదేశాంగ మంత్రి రూబియో మొదట పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌తో, తరువాత భారత జాతీయ భద్రతా సలహాదారుతో మాట్లాడారు.ఈ చర్చలన్నింటిలోనూ వాణిజ్యానికి సంబంధించి ఎటువంటి చర్చ జరగలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.ఈ సంభాషణ తర్వాతే అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ గురించి తెలియజేశారు.సోమవారం రాత్రి 8 గంటలకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రసంగంలో, పాకిస్తాన్ సైనిక, 'ఉగ్రవాద స్థావరాలపై' చర్య తీసుకోవడాన్ని వాయిదా వేశామని ప్రధాని మోదీ అన్నారు. ఉగ్రవాదం కొనసాగుతున్నంత కాలం పాకిస్తాన్‌తో చర్చలు జరపలేమని, పాకిస్తాన్‌తో వాణిజ్యం చేయలేమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారుఅమెరికా అధ్యక్షుడైన తర్వాత, డోనల్డ్ ట్రంప్ ఇతర దేశాలపై పరస్పర సుంకాలను నిరంతరం ప్రకటించారు. ట్రంప్ సుంకాల యుద్ధంలో ఓ కీలక క్షణం సోమవారం ఆయన చైనాతో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించడం ద్వారా వచ్చింది.అమెరికా కూడా భారతదేశంతో చర్చలు జరుపుతోంది, దీనిని డోనల్డ్ ట్రంప్ కూడా ప్రస్తావించారు. భారతదేశంపై 26 శాతంసుంకం విధిస్తామని ట్రంప్ ప్రకటించారు.భారతదేశందీనికి ప్రతిగా ఎటువంటి సుంకం విధించలేదు. బదులుగా విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడుతూ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశంపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో చర్చించామని చెప్పారు.భారతదేశం అమెరికాకు మందులు, ఆటో కాంపోనెంట్స్, దుస్తులు వంటివి ఎగుమతి చేస్తుంది.ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, సైనిక పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది.భారతదేశానికి అమెరికా ఐదవ అతిపెద్ద ముడి చమురు, ఎల్ఎన్జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) సరఫరాదారు. 2030 నాటికి దేశంలో సహజ వాయువు వినియోగ వాటాను 6.3 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని భారత ప్రభుత్వం కోరుకుంటోంది.అమెరికా భారతదేశానికి చేసే ఎగుమతులకంటే.. భారతదేశం నుంచి చేసుకునే దిగుమతులు ఎక్కువ.2023 సంవత్సరంలో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 190.08 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉంది. ఇందులో సేవారంగం వాటా 66.19 బిలియన్ డాలర్లు.ఇందులో భారత్ 83.77 బిలియన్ డాలర్ల వస్తువులను ఎగుమతి చేయగా, 40.12 బిలియన్ డాలర్ల వస్తువులను దిగుమతి చేసుకుంది. అంటే అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య దిగుమతి లోటు 43.65 బిలియన్ డాలర్లు.అమెరికా భారతదేశం మధ్య 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్, అమెరికా కోరుకుంటున్నాయి.అమెరికా విధించిన టారిఫ్‌ల కారణంగా సుమారు 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనుందని కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. టారిఫ్‌ల విషయంలో అమెరికా అనుసరిస్తున్న విధానాన్ని గతంలోనే భారత్ తప్పుబట్టింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించారు. ముడి ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ రంగంపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ఈ నేపథ్యంలోనే ఈ విషయాన్ని డబ్ల్యూటీవో వద్ద భారత్ గట్టిగా లేవనెత్తడంతో.. రెండు దేశాల మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# తండాల్లో దాహం దాహం

## గొంతు తడవాలంటే కిలోమీటర్ నడవాల్సిందే

## సంబంధిత అధికారులకు తెలిపిన పట్టించుకోని వైనం

## నీటి కోసం కోమటికుంట తండావాసులు ఆక్రందనలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 14 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం పరిధిలోని అల్లాదుర్గం మండలం, కోమటికుంట తండావాసులు, గొంతు తడుపుకోవడం కోసం, కిలోమీటర్ దూరం వెళ్లాల్సి వస్తుంది, నీటి సరఫరా నిలిచిపోయింది, ఉన్న ఒక్క బోరు పాడైపోయింది, దీంతో తండావాసులు గుక్కెడు నీటి కోసం తహ తహ లాడుతున్నారు, గొల్లకుంట తండా పంచాయతీ పరిధిలోని, కోమటికుంటలో, మిషన్ భగీరథ పైపు పగిలిపోయి పది రోజులు అవుతుంది, ఉన్న బోరు ఎప్పుడో పాడైపోయింది, దీంతో చిన్న పెద్ద, నెత్తిన బిందెలు పెట్టుకొని, కిలోమీటర్ నడిచి వ్యవసాయ బోర్ల వద్ద నుండి నీటిని తెచ్చుకుంటున్నారు, వ్యవసాయ పొలాల వద్ద బోర్లు ఉన్న రైతులు, వీరికి అభ్యంతరం తెలపడంతో, తాండ సమీపంలో ఓ ఆలయం వద్ద ఉన్న బోరును, ఆశ్రయిస్తున్నారు, విద్యుత్ అంతరయంతో పడిగాపులు కాస్తున్నారు, తండాలో ఇటీవల జరిగిన వివాహనీ కి, ఎడ్లబండ్లపై నీటిని తీసుకురావాల్సి వచ్చిందని వాపోయారు, ఈ విషయం అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన, ఎవరూ పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు, ఇప్పటికైనా దీనికి సంబంధించిన అధికారులు, మిషన్ భగీరథ పైపులు బాగు చేసి మా తండాకు నీరు, అందించగలరని వీరు కోరుతున్నారు....



## బుడమేరు గండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఇబ్రహీం పట్నం గత బుడమేరు వరదకు గండ్లు పడిన ప్రాంతాలను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. గతంలో అత్యవసరంగా పూడ్చిన 3 గండ్లు కలిపి రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టబోతున్నాం. సీజన్ మొదలయ్యేలోగా 3 గండ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి నిమ్మల మాట్లాడుతూ బుడమేరు డైవర్షన్ కెనాల్ ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. బుడమేరు వరద, ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా, డీపీఆర్ తయారీ దశలో ఉంది. బుడమేరు ఓల్డ్ ఛానెల్ కు సమాంతరంగా, మరొక కొత్త ఛానెల్ ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మానేజ్మెంట్ కింద, కేంద్రం సహకారం తో ముందుకు వెళ్ళేలా ప్రపోజల్స్ తయారు చేసాం. మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మానేజ్మెంట్ శాఖలు సమన్వయం చేసి ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందు ఉంచుతామని అన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు వినూత్న కార్యక్రమం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు, వానకాలం సాగుకు రైతులను సమయాత్తం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం %ద% బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారితో కలిసి " రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు " అనే వినూత్న కార్యక్రమాన్ని బుధవారం రోజున ఇల్లంతకుంట మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలో గల రైతు వేదిక నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం వివరించారు. అలాగే ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా ఉద్యాన శాఖ అధికారి లతా మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు యాజమాన్య పద్ధతులు, కూరగాయలు, పూల సాగు సబ్సిడీ వివరాల గురించి వివరించడం జరిగింది. రైతులందరూ యూరియా వాడకాన్ని తగ్గించి మరియు సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను వాడి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అలాగే రాబోవు నెలరోజుల పాటు జిల్లాలో వివిధ గ్రామాలలో జరిగే ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి, మట్టి పరీక్షలు – ప్రయోజనాల గురించి వివరించడం జరిగింది. పంట మార్పిడి పాటించండి సుస్థిర ఆదాయాన్ని పొందండి. చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అనే అంశాలపై శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సవివరంగా తెలియజేశారు. తదుపరి రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు తెలియజేశారు. అలాగే పైన తెలిపిన అంశాలను పాటిస్తామని రైతులందరూ అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన అధికారిని లత, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్. పి. మాధవి, డాక్టర్టి. టీ.అరుణ్ బాబు, మండల వ్యవసాయ అధికారి సురేష్, ఉద్యాన శాఖ అధికారి గోవర్ధన్, వ్యవసాయ విస్తరణ అధికారులు జ్యోతి, వి.అర్చన, రవళి, కే. అర్చన, లలిత, గంగ, అభిషేక్ మరియు ఉత్తమ రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్
## ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులనే అని మరిచిపోవద్దు



**ప్రజాబలం ప్రతినిధి ములుగు జిల్లా తేదీ: 14-05-2025**జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యములో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర పంచాయితీ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి వర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారు

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలని, ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉంటుందని మంత్రి వర్యులు సీతక్క అన్నారు

బుధవారం గోవిందరావుపేట మండలం చల్వాయి మోడల్ స్కూల్లో అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు

ఈ సందర్భంగా మంత్రి వర్యులు సీతక్క మాట్లాడుతూ సమాజ స్థాపనలో విద్యార్థులను ఉత్తమమైన, ఆదర్శనీయమైన విద్యార్థులుగా సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థులలో గుణాత్మకమైన మార్పు సాధించవచ్చునన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, నూతన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో అందిస్తున్న అంశాలను ఆకళింపు చేసుకొని పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థుల్లో ఆశించిన మార్పుల సాధన లక్ష్యంగా పని చేయాలని సూచించారు

ఈ కార్యక్రమములో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్

జిల్లా విద్యా శాఖ అధికారి ఫణిని తో మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలోని అర్హులైన శారీరక దివ్యాంగులకు వివిధ సహాయ ఉపకరణాల పంపిణీ చేసిన మంత్రి సీతక్క




**ప్రజా బలం ప్రతినిధి ములుగు జిల్లా తేదీ: 14-05-2025.** ఈరోజు అనగా దివి:- 14.05.2025 నాడు జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారము, జిల్లా సంక్షేమ అధికారి, మహిళలు, పిల్లలు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ - ములుగు గారి ఆధ్వర్యంలో ములుగు జిల్లా పరిషత్ ప్రాంగణంలో జిల్లాలోని అర్హులైన శారీరక దివ్యాంగులకు వివిధ సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమును నిర్వహించడం జరిగినది.

ముందుగా ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి %ఖ%.శిరీష గారు స్వాగతోపన్యాసం చేస్తూ జిల్లాలో ఇప్పటివరకు దివ్యా%శీ%గులకు అందించిన వివిధ సహాయ ఉపకరణాల గురించి మంత్రి గారికి వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ పంచాయితీరాజ్ %ద% గ్రామీణాభివృద్ధి శాఖ మరియు స్త్రీ %ద% శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు (శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) గారు జిల్లాలోని అర్హులైన శారీరక దివ్యాంగులకు వారి చేతుల మీదుగా వివిధ సహాయ ఉపకరణాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గోవిందరావుపేట మండలమునకు చెందిన దివ్యాంగుడు శ్రీ శనిగరపు నాగరాజు, వెంకటాపూర్ మండలం కు చెందిన శ్రీ సభావట్ లక్ష్మణ్ కు, బందారుపల్లి గ్రామముకు చెందిన శ్రీ గుండెపు శ్రీనివాస్ కు, ములుగు మండలమునకు చెందిన శ్రీ బొచ్చు శ్రీనివాస్ , శ్రీ అల్లా సురేష్ మరియు పెద్ద బోయిన శ్రీనివాసులకు 9 లక్షల 60 వేల విలువగల 6 రెట్రోఫిట్టెడ్ వాహనములు పంపిణీ చేయడం జరిగింది.

అనంతరం గౌరవ మంత్రివర్యులు (శ్రీమతి సీతక్క గారు మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. దివ్యాంగత్వం అంటే కేవలం ఒక భాగానికి పరిమితం అని,వాదాన్ని మనస్సు దాకా రానివ్వవద్దని అన్నారు. శారీరకంగా ఉన్న దివ్యాంగతను మనస్సులోకి రానిచ్చి ఆత్మ న్యూనతతో, భవిష్యత్ గురించి ఎలాంటి ప్రణాళికలు లేకుండా దివ్యాంగులు నిరాశా ధోరణిలో ఉండరాదని అన్నారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సహాయ ఉపకరణాలను వినియోగించుకొని తాము వెళ్ళే మార్గం లోనే కాదు, తమ జీవిత లక్ష్యాలను సాధించటంలో కూడా ముందుకు దూసుకు వెళ్లాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కొరకు ప్రభుత్వము కట్టుబడి ఉందని అన్నారు. దివ్యాంగుల అభివృద్ధి పట్ల ప్రభుత్వం సానుకూలతతో ఉన్నదని అన్నారు. దివ్యాంగులకు విద్యా పరమైన అంశాల్లో 4% రిజర్వేషన్లు మరియు సంక్షేమ పథకాలలో 5% రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందని తెలిపారు. మొన్న జరిగినటువంటి డిస్ట్రిబ్యూషన్ క్యాంపులలో దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్స్, స్టిక్స్, వినికిడి లోపం ఉన్నవారికి వినికిడి మిషన్లు ఇవ్వడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని రెట్రో ఫిట్టెడ్ వాహనములు తెప్పించి పంపిణీ చేయగలమని తెలిపినారు. జిల్లాలో ఉన్న దివ్యాంగుల కొరకు అవసరమైన క్యాంపులు నిర్వహించి దివ్యాంగులకు ప్రభుత్వం నుండి రావలసిన వాహనములు మరియు పథకాలను అమలు చేస్తామని తెలిపారు.



ఈ కార్యక్రమము నందు ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీ . బానోత్ రవిచందర్ గారు స్థానిక మండల పరిషత్ అధికారి శ్రీ. రామకృష్ణ గారు, జిల్లా సంక్షేమాధికారి కార్యాలయ సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సఖి, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**అకాల వర్షాలకు తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.**
**ప్రభుత్వం అధికారులు ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.**
**ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది.**
**తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి తేదీ: 14-05-2025**ఏటూరునగరం మండలం గోగుపల్లి గ్రామంలో లో నిన్న రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణనీటి సరఫరా శాఖ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క

ఈ సందర్భంగా మాట్లాడుతూ

తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఆరుగాలం కష్టం చేసి రైతులు పండించిన వరి ధాన్యం అకాల వర్షాలకు తడిసిన ముద్ద కావడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు

ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది.

పంట నష్ట పరిహారం ఎంతైనా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తుంది జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా ఎక్కడెక్కడ వరి ధాన్యం ఉన్న యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు

ఈ కార్యక్రమములో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## రామప్ప ఆలయానికి చేరుకున్న ప్రపంచ సుందరిమణులు

**అపూర్వ ఘన స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం**
**గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్య ప్రదర్శనలతో కళాకారుల స్వాగతం**



**ప్రజాబలం ప్రతినిధి ములుగు జిల్లా తేదీ : 14-05-2025**ములుగు జిల్లా రామప్ప ఆలయానికి ప్రపంచ సుందరిమణులు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర ఎస్పీ శబరిష జిల్లా అధికారులు టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరి మహిళలకు ఘన స్వాగతం పలికారు. గుస్సాడీ నృత్య ప్రదర్శన ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలోకి చేరుకున్న సుందరిమణులు ఎవరికి వారే స్వయంగా కాళ్లు కడుక్కొని పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరుతెన్నులను తనివి తీర తిలకించి ఫిదా అయ్యారు.తెలంగాణ ఉట్టిపడేలా పట్టుచీర / పట్టు పరికిణీలు కట్టుకొని తిలకం దిద్దుకొని అచ్చం తెలంగాణ అమ్మాయిల లాగా రామప్పలయం సందర్శించిన ప్రపంచ సుందరిమణులు ఆలయ విశిష్టతను తెలుసుకున్న ప్రపంచ అందగత్తెలు ఆలయానికి దీనికి సంబంధించిన చిత్రాలను సెల్ఫోన్లో ఫోటోలు తీసుకున్న సుందరిమణులు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల సిబిల్ పరిశీలన త్వరగా పూర్తి చేయాలి
## షెడ్యూల్డ్ కులముల సహకార సంస్థ ఈ.డి.చాతరాజుల దుర్గాప్రసాద్






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 14 :** అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అందిన దరఖాస్తుల సంబంధిత అభ్యర్థుల సిబిల్ స్కోర్ పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని షెడ్యూల్డ్ కులముల సహకార సంస్థ ఈ.డి.చాతరాజుల దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్,హాజీపూర్ మండలానికి సంబంధించిన బ్యాంక్ మేనేజర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులకు ఏర్పాటు చేసిన సంయుక్త మండల బ్యాంకర్ల సమావేశానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ.డి. మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంబంధిత సిబిల్ స్కోర్ పరిశీలన ప్రక్రియ 2 రోజులలో పూర్తి చేసి సంబంధిత మండలాలు, మున్సిపాలిటీలకు వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలో 40 వేల 270 దరఖాస్తులను సిబిల్ పరిశీలన కొరకు పంపించడం జరిగిందని, సిబిల్ స్కోర్ నిర్ధారణ అనంతరం తదుపరి కార్యచరణ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను ఈ నెల 17వ తేదీ లోగా పరిశీలించి సంబంధిత మండల, మున్సిపల్ అధికారులకు అందించాలని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన కమిటీలు అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెంప తొలగింపుతో ముగిసిన తిరుపతి తల్లి గంగమ్మతల్లి జాతర

తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర వేడుకగా ముగిసాయి. అమ్మవారి చెంప తొలగింపు కార్యక్రమంతో ఎనిమిది రోజుల పాటు వైభవంగా సాగిన జాతర పరిసమాప్తం అయ్యింది. అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని చూసేందుకు రాయలసీమ ప్రాంత ప్రజలు పోటెత్తారు. ఆలయం ముందు బాగంలో గంగమ్మ బొమ్మ తయారీలో దళితులు, కుమ్మరి, కంసాలి, చాకలి, మంగలి, గొల్ల వంటి మిరాశీదార్లు పాల్గొంటారు. గంగమ్మ బొమ్మకు కావలసినంత బంకమట్టిని పక్కనే ఉన్న కుమ్మరి వాళ్ళు బాగా పిసికి పక్కనున్న ఆచార్యులకు అందించడం ఆనవాయితీ. ఆచార్యులు నీలిమందునూనెను రంగరించి గంగమ్మ ముఖానికి నీలిరంగును అద్దారు. బంగారు పూతపూసిన వేప ఆకారంలో చెక్కబడిన ముక్కెరను అలంకరించారు. బంగారం రంగురేకుల చెవులను గంగమ్మ బొమ్మకు జోడించారు. చెవులకు బంగారంలా మెరి సే సింగపూరు రేకుతో చేయబడిన కమ్మలు, జుంకీలను అలంకరిస్తారుమంగలి వాళ్ళు గంగమ్మ బొమ్మ తలమీదతలమీద తెల్ల వెంట్రుకలను దారాల్లాగా పేడి, పొడవుగా వేలాడదీశారు. బంగారంలా ధగధగ మెరిసే సింగపూరు రేకుతోనే చేయబడి నగిషీలు చెక్కబడిన కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. కిరీటం క్రింద మల్లెపూలతోను., కనకాంబరాలతోను అలంకరిస్తారు. గంగమ్మ నుదురు భాగమంతా ఎర్రని కుంకుమను పట్టీలా పెట్టారు. నుదురు భాగం మధ్యలో వెండితో చేసిన అద్దనామాలను అమర్చారు. కనుబొమ్మల మధ్య గంధంతో పెద్ద బొట్టును పెట్టారు. గంగమ్మ బొమ్మ నోరు తెరుచుకొని ఉన్నట్లుగా రూపొని పెట్టారు. నోటినిండా ఎర్రకుంకుమను నింపారు. వెదురు దెబ్బలతో చేసిన పళ్ళను పెట్టారు. చాకలి వాళ్ళు తెచ్చిన చీరను గంగమ్మ బొమ్మకు చుట్టారు. గొల్లవాళ్లే తెచ్చిన మంగళసూత్రాలను గంగమ్మ మెళ్ళో వేశారు. గంగమ్మ చీరకు ఒడిబాలును గొల్లవాళ్లే తెచ్చి పెట్టారు. కొద్దిసేపు బంగారు తాళిబొట్టును గంగమ్మ బొమ్మకు కట్టి తీశారు. కింద వెండితో చేసిన కన్నులను అమర్చుతారు. వెండి కన్నుల మధ్యలో నల్లని కనుగుడ్లు పెట్టడానికి ఖాళీ ప్రదేశం ఉంటుంది. కనుగుడ్లను మాత్రం చివరలో పెడ్తారు. నల్లగుడ్లను పెడితే గంగమ్మ బొమ్మకు ప్రాణం వచ్చినట్లు భావిస్తారు. తెల్లవారు జాముకు పేరంటాలు తాతయ్య గుంట గంగమ్మ గుడికి పేరంటాలు చేరుకున్నాయి. గుడి ముందున్న గంగమ్మ బొమ్మను చూస్తూనే పేరంటాలు వేషానికి పూనకం వచ్చి చిందులేసేదేతో హారతి సమర్పించింది. గంగమ్మ బొమ్మ దగ్గరుండే వారు పేరంటాలు వేషానికి హారతిచ్చిగంగమ్మ పూలహారాన్ని తీసి పేరంటాలు వేషానికి వేస్తారుతర్వాత చుట్టూ ఉన్న జనం, అరుపులు, కేకలు, కిలారింపులు అధికమౌతాయి.

# పండుగ వాతావరణంలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణ

**ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు**

**కడపలో మహానాడు ఏర్పాట్లపై మంత్రులు, సీనియర్ నేతలతో మంత్రి నారా లోకేష్ సమావేశం**



మంగళగిరిః కడపలో పండుగ వాతావరణంలో తెలుగుదేశం పార్టీ మహానాడును నిర్వహిస్తామని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం నిర్వహించారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలవురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అన్న ఎన్టీఆర్ గారి దగ్గర నుంచి పండుగ వాతావరణంలో మహానాడును నిర్వహించడం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. వసతి, రవాణకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈ సందర్భంగా నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు రోజుల పాటు మహానాడు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మొదటి రోజు తెలుగుదేశం పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చ జరగనుంది. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గ మహానాడు నిర్వహణపైనా సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎస్.సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేల జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్!

**దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు 16న మంత్రి లోకేష్ శంకుస్థాపన**

**ప్రజాప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు**



అమరావతి, 14-5-25: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తెచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (%×జజు%)తో పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఎపికి క్యూకడుతున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో రెన్యూ సంస్థ రూ.22వేల కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈనెల 16వతేదీన రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేష్, రెన్యూ చైర్మన్ సుమంత్ సిన్హా నడుమ జరిగిన వ్యూహాత్మక చర్చలు ఫలించడంతో లోకేష్ ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూ పవర్ ముందుకు వచ్చింది.

రెన్యూ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు తొలిదశలో రెన్యూ సంస్థ 587మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్, 415 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై రూ.7 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వివిధ దశల్లో 1800 మెగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2000 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై మొత్తంగా 22 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ గా ఆవిర్భవించడమే గాక ఎపి క్లీన్ ఎనర్జీ కెపాసిటీ, గ్రిడ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. 2019కి ముందు 777 మెగావాట్ల సామర్థ్యంతో ఎపి పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న రెన్యూ... ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక విధానాలతో పెట్టుబడులు పెట్టడం ఆపేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న పిపిఎలన్నింటినీ జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దుచేసింది. వైసిపి ప్రభుత్వ అనాలోచిత చర్యలతో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జీరోస్థాయికి పడిపోయింది.




రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది. గత ఏడాది అక్టోబర్ లో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను దావోస్ చర్చల్లో మంత్రి లోకేష్ రెన్యూ పవర్ చైర్మన్ కు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఫాస్ట్-ట్రాక్ అనుమతులు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు పునరుత్పాదక ఇంధనరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయడమేగాక పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపాయి. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. వచ్చే ఐదేళ్లలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి నారా లోకేష్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పించారు. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.65వేలకోట్లతో 500 సిబిజి ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు రాగా, కనిగిరిలో తొలిప్లాంట్ కు మంత్రి లోకేష్ ఇటీవల భూమిపూజ చేశారు. టాటా పవర్ (7వేల మెగావాట్లు, రూ.49వేలకోట్ల పెట్టుబడి), ఎన్ టి పిసి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు (రూ.1.86లక్షల కోట్లు), వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా (10వేల మెగావాట్లు, రూ.50వేల కోట్లు), ఎస్ఎఈఎల్ ఇండస్ట్రీస్ (1200 మెగావాట్లు, 6వేలకోట్ల పెట్టుబడులు), బ్రూక్ ఫీల్డ్ (8వేల మెగావాట్లు, రూ.50వేలకోట్ల పెట్టుబడి) తదితర ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రాబోయేరోజుల్లో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలవనుంది.

# జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ అమలు

**ట్రాక్టర్ యజమానులు పూర్తి వివరాలు కలెక్టరేట్లో నమోదు చేసుకోవాలి**

**వారం రోజుల్లోగా దరఖాస్తులు అందజేయాలి**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -14 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ ద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇసుక రవాణా పూర్తిగా త్వరలో ఆన్లైన్ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ట్రాక్టర్ అందరు యజమానులు, బాధ్యులు తమ వాహనాల లైసెన్స్, ఇతర అన్ని పత్రాలు, డ్రైవర్ వివరాలు డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలు.. అలాగే జిల్లా కలెక్టర్ పేరిట రూ. 10 వేల డీడీ తీయాలని తెలిపారు. ఆయా వివరాలు, పత్రాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సీ సెక్షన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వాహన యజమానులు, బాధ్యులు ఈ వివరాలన్నీ వారం రోజుల్లోగా అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో అనుమతి పొందిన సాండ్ రీచ్ ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు

# 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం**

**వివిధ శాఖల అధికారులతో సమీక్షలో కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 14 (ప్రజాబలం ప్రతినిధి)**ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య సిబ్బంది వద్ద మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోవాలని, పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ వారు బస్ లను సమయానుకూలంగా నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరా లు ఉండాలని తెలిపారు.

ఉదయం.. మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 2385 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 1478 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 22 వ తేదీ నుంచి 29వ తేదీ దాకా నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్ వారికి పరీక్షలు ఉదయం 9 గంటలకు మొదలై పగలు 12 గంటల దాకా, సెకండ్ ఇయర్ వారికి 2.30 గంటలకు మొదలై 5.30 గంటల దాకా చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ అమలు..

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎస్బీ డీఎస్పీ మురళి, డీఈఐఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రజిత, ఆర్టీసీ, పోస్టల్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం




**రాజన్న సిరిసిల్ల జిల్లా , మే 14 (ప్రజాబలం ప్రతినిధి)**రైతులకు మేలైన సాగు పద్దతులపై అవగాహన కల్పించడంతో పాటు, వానాకాలం సాగుకు రైతులను

సమాయత్తం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం %డ% బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని ఈ రోజు ఇల్లంతకుంట మండలములోని పెద్ద లింగాపూర్ గ్రామంలో గల రైతువేదిక నందు నిర్వహించడం జరిగింది ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, జిల్లెల్ల వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. అలాగే ముఖ్య అతిధి గా వచ్చిన జిల్లా ఉద్యాన శాఖ అధికారి లత మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, కూరగాయలు పూల సాగు సబ్సిడీ వివరాలు గురించి వివరించడం జరిగింది.రైతులందరూ యూరియా వాడకాన్ని తగ్గించి మరియు సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను వాడి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అలాగే రాబోవు నెల రోజుల పాటు జిల్లాలో వివిధ గ్రామాలలో జరిగే ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. అలాగే వ్యవసాయ కళాశాల వారునేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి, మట్టి పరీక్షలు- ప్రయోజనాలు గురించి వివరించడం జరిగింది.పంట మార్పిడి పాటించండి సుస్థిర ఆదాయాన్ని పొందండి, చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అనే అంశాలపై శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు తెలిపారు. తదుపరి రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు తెలియజేశారు. అలాగే పైన తెలిపిన అంశాలను పాటిస్తామని రైతులందరూ అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన అధికారిని లత బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, జిల్లెల్ల , అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్. పి. మాధవి, డాక్టర్ .టి. అరుణ్ బాబు,మండల వ్యవసాయ అధికారి శ్రీ. సురేష్, ఉద్యాన శాఖ అధికారి గోవర్ధన్, వ్యవసాయ విస్తరణ అధికారులు జ్యోతి, వి. అర్చన, రవళి,కె. అర్చన, లలిత, గంగ,అభిషేక్ మరియు ఉత్తమ రైతులు పాల్గొన్నారు.

## స్వాతి వినాయక హాస్పిటల్ డైరెక్టర్ లక్ష్మణరావును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రసాద్ దంపతులు



**ఖమ్మం ప్రతినిధి మే 14 (ప్రజాబలం)** ఖమ్మంలో ప్రముఖ హాస్పిటల్ లు స్వాతి మరియు వినాయక డైరెక్టర్ పసుమర్తి లక్ష్మణరావు ను మర్యాదపూర్వకంగా కలిసిన విద్యుత్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం . ప్రసాద్ దంపతులు ఇటీవల హాస్పిటల్ మీద ఆరోపణలు రావడంతో హైకోర్టు స్టే ఇవ్వడం జరిగినది కావున ఈ సందర్భంగా నిజాయితీ నిరూపించుకున్న యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు

# సమస్యల అల్కాపూర్ టౌన్షిప్



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 14 మే 2025**మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా అల్కాపూర్ టౌన్షిప్ రోడ్ నెంబర్ 4 మరియు పక్కన ఉన్న రోడ్లలోనీ స్థానికులను కలవడం జరిగింది.


సెక్టార్ వన్ డి బ్లాక్ రోడ్ నెంబర్ 4లో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉన్నది. ఈ నిర్మించవలసిన రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

అల్కాపూర్ టౌన్షిప్ నుండి నార్సింగ్ రోడ్డు మరియు సాయి గౌతమ్ కాలనీ మీదుగా పుప్పాలగూడ రోడ్లు చాలా కాలం నుంచి అందుబాటులోకి రాని కారణంగా అల్కాపూర్ టౌన్షిప్ నుంచి వచ్చే ట్రాఫిక్కు సరైన రోడ్డు మార్గం లేక స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు, కావున రాష్ట్ర ప్రభుత్వం అటు కేంద్ర డిఫెన్స్ డిపార్ట్మెంట్ తోటి మరియు హెచ్.ఆర్.డి.సి.ఎల్ ద్వారా ఈ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.వీధి కుక్కల బెడద స్థానికంగా ఎక్కువగా ఉన్నదని తెలియ జేయడం జరిగింది. ఇప్పటికే పలుమార్లు మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ మున్సిపల్ కమిషనర్ వారి దృష్టికి ఈ సమస్య గురించి తేవడం జరిగింది. అంతేకాదు వీధి కుక్కల సంరక్షణ కొరకు వాటికి షెల్టర్ హోమ్స్ నిర్మించాలని కోరడమైనది. ఒకపక్క ప్రభుత్వ ఖాళీ స్థలాలు అన్యకాంతమై పోతుంటే రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వ ఖాళీ స్థలాలను ప్రజా ఉపయోగాలకు వాడకుండా చోద్యం చూస్తున్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని బి.ఆర్ ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అల్కాపూర్ టౌన్షిప్ వాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న విషయాన్ని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తేవడం ద్వారా వారు తగు చర్యలు తీసుకోగలమని హామీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీద నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, సంఘం శ్రీకాంత్, భానుచందర్, ఆరిఫ్ మహమ్మద్, శ్రీధర్, షైక్ ఆరిఫ్, సుమ నళిని, చెరుకూరి బాలాజీ మొదలగు వారు పాల్గొన్నారు.

# విజయదుందుబి మోగించిన ఒయాసిస్ పాఠశాల




**ప్రజాబలం ప్రతినిధి** హనుమకొండ జిల్లా మే14: సిబిఎస్ఈ -2025 పది ఫలితాల్లో వరంగల్ లోని ఒయాసిస్ పాఠశాల విజయదుందుబి మోగించింది. క్రమశిక్షణ, సమయపాలన, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు నిలయమైన ఓయాసిస్ విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారు. ఇ. వర్షిత్ అనే విద్యార్థి 500 మార్కులకు గాను 483 మార్కులు సాధించి జంటనగరాలలో ఉత్తమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఓయాసిస్ పాఠశాల అధినేత డా" జెఎస్. పరంజ్యోతి మాట్లాడుతూ తమ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ నిరంతరం కృషి చేశారని చెప్పారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతో ప్రతి నిమిషాన్ని, సెకండ్లుగా విభజించి సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ ఫలితాల్లో తమ పాఠశాల అగ్రస్థానంలో ఉన్నందున ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు డా.పరంజ్యోతిని కలిసి ఫలితాల పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# పడి లేచిన కెరటం రాయల శేషగిరిరావు

## ఉన్నత విలువలతో కూడిన రాజకీయాల్లో రాణించిన నాయకుడు రాయల

## రాయల వెంకట శేషగిరిరావు విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం ప్రతినిధి మే 14 (ప్రజాబలం)** ఖమ్మం ఉన్నత విలువలతో కూడిన రాజకీయాల్లో రాణించిన గొప్ప నాయకుడు రాయల వెంకట శేషగిరిరావు అని బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం నాడు తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో కీర్తిశేషులు రాయల శేషగిరిరావు నివాసానికి తల్లాడ మండలం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు రాయల అభిమానులతో కలిసి వెళ్లి ఇటీవల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించిన రాయల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాయల శేషగిరిరావు 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో తన ప్రధాన అనుచరుడుగా 20 సంవత్సరాలు పాటు ఆయనతో అనుబంధం ఉందన్నారు. రాయల, తాను రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నామన్నారు. ఆయనకు రావాల్సిన పదవులు రాలేదనీ అయినా ఏనాడు నిరుత్సాహానికి గురికాలేదనీ ఆయన పడి లేచిన కెరటంలా ముందుకు సాగారన్నారు. ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యలపై పని చేశారని, రైతు నాయకుడిగా రైతాంగ సమస్యలపై పోరాడి వారి గుండెల్లో చిరస్థాయిగా ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచి ఉంటారన్నారు. రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తూ రైతు నాయకుడిగా, డిసిసిబి డైరెక్టర్ గా, డీసీఎంఎస్ చైర్మన్ గా ఎనలేని కృషి చేశారని తెలిపారు. రాయల ఒక తల్లాడ మండలం కు మాత్రమే పరిమితమైన వ్యక్తి కాదు, ఆయనకు జిల్లా వ్యాప్తంగా అభిమానులు ఉన్నారని, ఆయన ద్వారా ఎందరో లబ్ధి పొందినారన్నారు. రాయల లేని లోటు ఇటు కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. అనంతరం అదే గ్రామంలో



కొండపల్లి చంద్రశేఖర్ ఇటీవల మరణించారు, ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను కూడా నామ పరామర్శించారు

ఈ కార్యక్రమం లో ఆయన వెంట నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్,తల్లాడ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, వైరా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మోరంపూడి ప్రసాదరావు మొండితోక జయకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, వజ్రాల రామిరెడ్డి, బద్దం కోటిరెడ్డి, కేతినేని చలపతిరావు, ముచ్చు మురళీధర్ రావు, నాయుడు శ్రీను, మాజీ ఎంపిటీసీ, కోపేల కనకయ్య, నూతనకల్ మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు, పాల్వంచ రాజేష్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, సూతగాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు



# ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోండి

**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా మే14:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉచిత బస్సు మూలంగా ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయని తెలంగాణ ఆటో డ్రైవర్ల యూనియన్ పైడిపల్లి శాఖ అధ్యక్షుడు మట్టెడ ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పైడిపల్లి గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఆటో నడుపుతూ జీవనం పొందుతున్నారని ఆయన తెలిపారు. తమకు జీవనం దిన దిన గండం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ తరపున తనకు గృహ లక్ష్మీ పథకం కింద ఇల్లు మంజూరు అయిందని ఆయన తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులు వచ్చి తనకు రాలేదని చెప్పారని ఆయన అన్నారు. ఈ విషయంపై గ్రామ ఇన్చార్జికి తెలియజేశానని చెప్పారు. తన పరిస్థితిని అర్థం చేసుకొని తనకు ఇల్లు మంజూరు చేయాలని ఆయన వర్ధన్నపేట ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు.

# విక్రం రావుకు ఘన నివాళులు

## సంతాపం తెలిపిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు





**మహబూబ్ నగర్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి** మహబూబ్ నగర్: సుప్రసిద్ధ జర్నలిస్టు ఐఎఫ్డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు విక్రమ్ రావు అకాల మరణం పట్ల మహబూబ్ నగర్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంతాపం తెలిపింది. బుధవారం జిల్లా కేంద్రంలోని ఫెడరేషన్ కార్యాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పత్రికా రంగంలో అనేక హోదాలు నిర్వర్తించి జర్నలిస్ట్ లకు ఎన్నో రకాల సేవలు అందించిన విక్రం రావు తెలుగువాడు కావడం మన అదృష్టమని ఆయన సేవలను గుర్తిచేసుకున్నారు. అదేవిధంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేసి జాతీయస్థాయిలో ఐఎఫ్డబ్ల్యూజేను స్థాపించి దేశ నలుమూలల నుండి ఫెడరేషన్ జర్నలిస్టుల ఐక్యతను చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బండి విజయ్ కుమార్. తాటికొండ కృష్ణ, ఫెడరేషన్ జిల్లా ఫౌండర్ మంగళగిరి యాదగిరి ,రాష్ట్ర కమిటీ సభ్యులు మొహమ్మద్ రఫీ , జిల్లా ఫెడరేషన్ అధ్యక్షులు వాకిట అశోక్ కుమార్, జిల్లా నాయకులు సుకుమార్ జంగం దిలీప్ కుమార్, వేణుగోపాల్ గౌడ్ రామకృష్ణ పసుపుల శ్రీను ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ సీఐ నరసింహ రాజు మానవత్వం.. ప్రజల మన్ననలు



**కూకట్పల్లి (ప్రజబలం)మే 14** :బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) నరసింహ రాజు తన వినూత్నమైన పౌర-కేంద్రీకృత పోలీసింగ్ విధానంతో స్థానికులు సందర్శకుల నుండి విస్తృత ప్రశంసలు అందుకుంటున్నారు.తీవ్రమైన వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సీఐ రాజు పోలీస్ స్టేషన్లో చల్లని మజ్జిగ కౌంటర్ను ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం స్టేషన్కు వచ్చే వారికి ఈ ఆలోచనాత్మకమైన చర్య ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఎండ వేడికి అల్లాడుతున్న ప్రజలకు చల్లని మజ్జిగను అందించడం ద్వారా నరసింహ రాజు నేతృత్వంలో బాలానగర్ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. పోలీస్ స్టేషన్కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని సంతోషంగా వినియోగించుకుంటున్నారు.

ఇది మాత్రమే కాకుండా, సీఐ నరసింహ రాజు తన డివిజన్లో శాంతి, సామరస్యాన్ని కాపాడటంలో చేస్తున్న కృషికి ప్రజల నుండి విశేషమైన గుర్తింపు లభించింది. ఇటీవల, తెలంగాణ డీజీపీ కార్యాలయం నిర్వహించిన సర్వేలో ప్రజల అభిప్రాయాల ఆధారంగా ఆయన “ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ)”గా ఎన్నికయ్యారు. ఈ పురస్కారం ఆయన చేపట్టిన కార్యక్రమాల యొక్క సానుకూల ప్రభావాన్ని, సాంప్రదాయ చట్ట అమలు విధులకు మించి సమాజానికి సేవ చేయాలనే ఆయన నిబద్ధతను తెలియజేస్తుంది. పౌరుల శ్రేయస్సుపై ఆయన దృష్టి సారించడం వల్ల బాలానగర్ డివిజన్లో పోలీసులకు మరియు ప్రజలకు మధ్య బలమైన అనుబంధం ఏర్పడింది అనడంలో సందేహం లేదు. నరసింహ రాజు యొక్క స్ఫూర్తిదాయకమైన చర్యలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను పలువురు కొనియాడుతున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో అవినీతిని అరికట్టే అధికారులు లేరా



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే14 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో కాశపాగ ఇమ్మయ్య, మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి పెరిగిపోతుందని, అయినా ఏసీబీ అధికారులు ఎందుకు స్పందించడం లేదు, జిల్లా, మండల, కార్యాలయాల్లో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని, జిల్లా అధికారులకు చెప్పిన, స్పందించి చర్యలు తీసుకుని అధికారులు కరువయ్యారని అన్నారు, ఏ స్థాయిలో ఉన్న ప్రతి ప్రభుత్వ అధికారికి, సుమారు 50, 000 వేల నుండి,1,00,000, రూ పైనే జీతాలు బత్యాలు తీసుకుంటున్న, గౌరవ అధికారులు, దేశానికి అన్నం పెడుతున్న, రైతులు చిన్నచిన్న సమస్యలపై అధికారుల వద్దకు వెళ్తే, వేళల్లో లంచాలు తీసుకోకుండా, అసలు ఫైలు కదలని పరిస్థితి, నెలకొంటుంది, కనీసం వీరికి సిగ్గనిపించడం లేదా అని, ఆవేదన వ్యక్తం చేశారు, జిల్లాలో ఆరోగ్య శాఖలో, రెవెన్యూ శాఖలో, పోలీస్ శాఖలో, ట్రెజరీలో , ఆహార క్వాలిటీ, మద్యపానం శాఖలో, మైనింగ్ శాఖలో, ఇలా ఏ శాఖలో చూసిన, అవినీతి అధికారులు, ప్రతిరోజు వేల రూపాయల, అవినీతి సంపాదనతో, మూడు పువ్వులు ఆరు కాయలుగా, కాలం గడిపేస్తున్నారని ఆయన అన్నారు.....

# చిరు వ్యాపారుల బతుకులను ఛిద్రం చేయద్దు

# చిరు వ్యాపారుల జోలికి రావొద్దు

### కూలగొట్టిన చిరు వ్యాపారుల దుకాణాలను వెంటనే పునర్నిర్మించే వరకు పోరాడుతాం

### మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ గారు




**హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి**:ఓరుగల్లు నగరంలోని చిరు వ్యాపారుల వ్యాపార సముదాయాలను కూల్చినందుకు నిరసనగా... ఆ పేదల పక్షాన భారత రాష్ట్ర సమితి పార్టీ బుధవారం రోజున వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు

ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ గారు మాట్లాడుతూ....

అందగత్తెల కోసం చిరు వ్యాపారుల జీవితాలను ఆగం చేయొద్దని అన్నారు

చిరు వ్యాపారుల చట్టం ప్రకారం వాళ్లకి హక్కులు, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు

కేసీఆర్ గారి పదేండ్ల పాలనలో, మాజీ మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కేటీఆర్ గారి హయాంలో ఓరుగల్లు పట్టణంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు

చిరు వ్యాపారుల సముదాయాలను ఆధునికరించడం, వసతులను కల్పించడం జరిగిందని వివరించారు.

చిరు వ్యాపారులకు రుణాలు సైతం అందించడం జరిగిందని తెలిపారు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పెద్దల పై




ప్రేమ... చిరు వ్యాపారులపై ప్రతాపం చూపుతోందని విమర్శించారు

చిరు వ్యాపారులపై కాంగ్రెస్ ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు, పోలీసుల దౌర్జన్యం నశించాలని నినదించారు.

చిరు వ్యాపారుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని అన్నారు

ఓరుగల్లు చరిత్రను విశ్వవ్యాప్తం చేయడానికి మేము వ్యతిరేకం కాదు కానీ అందగత్తులు ఇస్తున్నారని అమాయకుల జీవితాలను ఆగం చేయొద్దని కోరుతున్నాం

పండ్ల వ్యాపారులు, చాయ డబ్బాలు, పాన్ షాపులు ఇలా చిన్నచిన్న ఉపాధి కార్మికుల జీవితాలను ఆగం చేశారు

కాంగ్రెస్ ప్రభుత్వం చిరు వ్యాపారుల జీవితాలతో ఆడుకుంటుంది, ఆగం చేస్తోంది

కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోంది

కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైంది

హామీల అమలు మరిచి పేదలపై దౌర్జన్యం, కూల్చివేతలు చేస్తోంది

దివ్యాంగురాలైన మహిళ స్వయం ఉపాధి పొందుతూ డబ్బా పెట్టుకుంటే దాన్ని కూడా కూల్చేశారు

ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు రోజుల గడివిస్తున్నాం రెండు రోజుల్లోగా కూలగొట్టిన చిరు వ్యాపారుల సముదాయాలను పునర్ నిర్మించాల్సిందే

అనంతరం ఎంజీఎం కూడలిలో చిరు వ్యాపారుల కోసం ధర్నా రాస్తారోకో నిర్వహించారు

కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, సిద్ధం రాజు, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, ఇమ్మడి లోహితా రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, మేకల బాబు రావు, తండమల్ల వేణు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు నయీమొద్దీన్, జానకీరాములు, రామ్మూర్తి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి.

### పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి.

### బోయినపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం),** ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించి, పోలీస్ స్టేషన్ ఆవరణలో 5 ఎస్ అమలు తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, స్టేషన్ రికార్డ్స్, పెండింగ్ ఫైల్స్ మరియు రికార్డ్ రూమ్, తదితర అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విజిబుల్ పోలీస్ పై ప్రత్యేక దృష్టి పెడుతూ గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. పాత నేరస్తులపై, రౌడీషీటర్స్ పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాలపై, వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. స్టేషన్ పరిధిలో తరచు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టా లన్నారు. ప్రతిరోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పి వంట వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### వేములవాడ బంద్ కు స్పందన కరువు.

### పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ప్రతిపక్ష బి ఆర్ ఎస్, బిజెపి పార్టీలు ఇచ్చిన వేములవాడ పట్టణ బంద్ పిలుపునకు ఎలాంటి స్పందన లేదని, వేములవాడ పట్టణ బంద్ పూర్తిగా విఫలమైందని, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు కనికరపు రాకేష్ అన్నారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా, రాజన్న ఆలయ అభివృద్ధి ఆగదన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజన్న ఆలయం, వేములవాడ పట్టణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని వారు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చిలుక రమేష్, పులి రాంబాబు గౌడ్, తోటరాజు, నాగుల రవీందర్, నాగుల విష్ణు, నాగుల రాము, సయ్యద్ సాబీర్, అబ్బటి చందు, దూలం భూమేష్, అక్కనపల్లి నరేష్, కూతాడి రాజేశం, అరుణ్ తేజ చారి, కొక్కుల బాలు, గుర్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణ వాసుల సహకారంతో బంద్ విజయవంతం.

### నిధులే లేనప్పుడు అభివృద్ధి ఎలా సాధ్యం.

### 60 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆలయ అభివృద్ధి ఎందుకు చేయలేదు.

### ఆలయం మూసేస్తే పరివార దేవత మూర్తుల విగ్రహాలను, కోటిలింగాలను తొలగించకూడదని డిమాండ్.

### ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ.







**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజు వేములవాడ పట్టణ ప్రజల సహకారంతో బంద్ విజయవంతంగా ముగిసిందని రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర నిధులే లేవని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినప్పుడు, రాజన్న ఆలయ అభివృద్ధి ఎలా చేస్తారని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాజన్న ఆలయ మూసివేస్తే పరివార దేవత మూర్తుల విగ్రహాలను, కోటిలింగాలను తొలగించకూడదని ఆయన డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ఎలాంటి మ్యాపు ఇంకా విడుదల చేయకపోవడంతో ఎలా అభివృద్ధి చేస్తారు అనే సందేహం భక్తుల్లో నెలకొంది అన్నారు. వ్యక్తిగత ప్రతిష్ట కోసం పనిచేస్తున్నారు తప్ప, రాజన్న పై భక్తితో కాదని ఆయన విమర్శించారు. 60 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజన్న ఆలయాన్ని అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బి ఆర్ ఎస్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బంద్ పేరిట రాజన్న ఆలయం పై రాజకీయాలు చేయడం తగదు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకోని వేములవాడ పట్టణం లోని రాజన్న ఆలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్ ల సహకారంతో 76 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామంటే బిజెపి, బి ఆర్ ఎస్ నాయకులు అడ్డు తగులుతున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు.

మేము చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకనే బుధవారం రోజు రెండు పార్టీలు వేములవాడ పట్టణ బంద్ కు పిలుపునిచ్చాయన్నారు.

తన లగ్గం ఇక్కడే అయిందని చెప్పుకుంటూ, ఏటా 100 కోట్ల రూపాయలు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వని బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ ఒకవైపు, మూడుసార్లు కేంద్రంలో అధికారంలో ఉండి రాజన్న ఆలయానికి ఒక్క పైసా ఇవ్వని బిజెపి పార్టీ నాయకులు మరోవైపు రాజన్న ఆలయ అభివృద్ధికి అడ్డుపడడం బాధాకరంగా ఉంది అన్నారు.

రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నందుకు స్వాగతించాల్సింది పోయి అడ్డు తగలడం విడ్డూరంగా ఉంది అన్నారు.

అభివృద్ధిలో భాగంగా స్వామి వారికి జరిగే సుప్రభాత సేవ నుండి మొదలుకొని రాత్రి వరకు జరిగే అన్ని నిత్య పూజలు యధావిధిగా జరుగుతాయని పదేపదే చెప్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

దేవాలయం బంద్ అనేది, మూసివేత అనేది దేవాలయం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని చెబుతున్నామన్నారు.

కానీ అభివృద్ధిలో భాగంగా మంటపాన్ని విస్తరిస్తూ పనులు సాగిస్తామని, ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు సాగిస్తామని అని తెలిపారు.

అసలు ఇంట్లో ఉండి ఇంటి నిర్మాణాన్ని ఎలా సాగిస్తారు..? ఇంట్లో ఎవరైనా ఉంటారా అనే విషయం కూడా అర్థం కాకుండా ఉంది వాళ్లకు అన్నారు.

ఆలయ విస్తరణ చేస్తున్నప్పుడు పలంచ కట్టెలు ఉంటాయి, స్లాబ్ లు వేస్తారు, అలాంటి సందర్భాలలో భక్తుల ఇబ్బందులను చూస్తూ నిర్మాణ పనులు ఎలా చేస్తారని అని ఎదురు ప్రశ్నించారు.

భక్తులకు అందించే సేవలను దూరం చేయకుండా ఉండే అందుకే శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేస్తే రాజన్నకు చేసే పూజలు భీమన్నకు ఎలా చేస్తారని వితండవాదం చేస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

రాజన్న ఆలయంలో పరమశివుడు ఉన్నాడు, భీమన్న ఆలయంలో కూడా పరమశివుడే ఉన్నాడని ఆయన తెలిపారు.

రాజన్న ఆలయం పురాతన ఆలయం. భీమేశ్వర ఆలయం కూడా పురాణమైనదే. ఇక్కడికి కూడా మహాభారతంలో ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు వచ్చారు. వారు భీమేశ్వర ఆలయాన్ని కూడా వచ్చి దర్శనం చేసుకున్నట్లు పురాణాల్లో ఉంది.

సూర్య భగవానుడు, ఇంద్రుడు వచ్చి దర్శించుకున్నట్లు పురాణాల్లో, ఇతిహాసాలలో చూస్తున్నాం.

ఇలాంటి పౌరాణిక చరిత్ర కలిగిన దేవాలయాల్లో భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నందున ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు 76 కోట్ల రూపాయలతో విస్తరణ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

ఇందులో భాగంగా ఆలయ అంతర్భాగాన్ని మొదటి విడతగా విస్తీర్ణం చేయడానికి పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యామని తెలిపారు.

బంద్ ప్రకటించడానికి రెండు రోజుల ముందు ఆలయ పరిరక్షణ కమిటీ వేసుకున్నారు అని, ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వం మీరు చెప్పిందే వింటుందని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూస్తుందని చెప్తున్నప్పటికీ ఆలయ ఈవో, మంత్రి, ముఖ్యమంత్రి, అర్చకులు, ఆర్కిటిక్ తో అందరూ శృంగేరి పీఠాధిపతుల నిర్ణయానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధి చేస్తామని చెప్తున్నప్పటికీ మళ్లీ అడ్డంకులు సృష్టించేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

ఏదైనా సమస్య వస్తే మీరు, మేము అందరం కలిసి ముందుకు వెళ్దామని చెప్తున్నప్పటికీ ముందు బాగాన ఓకే అంటూ, వెనకాల రాజన్న భక్తులను ఇబ్బంది పెట్టే పనులు మంచివి కావని చెప్తున్నామన్నారు.

బంద్ పేరిట రాజకీయాలు దయచేసి చేయకూడదని కోరుతున్నాను అన్నారు.

ప్రతిపక్షాలు చెప్పే ప్రతి విషయాన్ని వినడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మీరు చెప్పే ప్రతి విషయాన్ని పాజిటివ్ కోణంలో తీసుకొని రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

తాను ఇప్పటివరకు మూడుసార్లు మీరు చెప్పింది వినడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశాను అన్నారు.

రాజన్న ఆలయ జీర్ణోద్ధరణ కాదు.. ఆలయ పునరుద్ధరణ కాదని పదేపదే చెప్తున్నమన్నారు.

ప్రధాన దేవాలయం, ఉప దేవాలయాలకు సంబంధించి యధావిధిగా ప్రతిరూపాలు అని చెప్తున్నప్పటికీ ఎందుకు ఇలా గందరగోళానికి తెర తీస్తున్నారు అని ప్రతిపక్షాలను సూటిగా ప్రశ్నించారు.

అసలు మీకు ఎవరు చెప్పారు... మహా మండపాన్ని ముట్టుకుంటామని..? దేవాలయాలను మారుస్తారు అని ఎవరు చెప్పారు..?

మార్పును సహించేది లేదని అంటున్నారా అసలు మారుస్తాం అని ఎవరు చెప్పారు..?

ఒక దగ్గరనే సమస్య వచ్చింది, ఆ సమస్య తీర్చేందుకు శృంగేరి పీఠాధిపతులు చెప్పినట్టుగా 2024-25 బడ్జెట్లో 50 కోట్లు,2025-26,100 కోట్లు పెట్టుకున్న మొత్తం కలిపి 150 కోట్లతో దేవాలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, వీ టి డిఏ తో అభివృద్ధి చేయాలనుకున్నామన్నారు.

దీనికి సంబంధించి ఇప్పటికే 47 కోట్లు వీటీడీఏ వైస్ చైర్మన్ గా ఉన్న జిల్లా కలెక్టర్ ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు.

వాస్తవాలు ఇలా మీ ముందు ఉండగా, ఆల్రెడీ ఆలయ విస్తరణకు సంబంధించి 76 కోట్ల టెండర్ ప్రక్రియ పిలుస్తున్నది బహిరంగమే కదా.. ఇందులో రహస్యం ఎక్కడ ఉంది అన్నారు.

ఇది మీ ఇల్లు అని అంటున్నారు.. ఇది మీ ఇల్లు కాదు.. మా ఇల్లు కాదు దక్షిణ కాశీగా పేరుగాంచిన పరమశివుని నిలయమని ఆయన అన్నారు.

## రేపే నెల్లూరు రూరల్ లో 339 అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల జాతర.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. చెప్పిన మాటకు కట్టుబడి 5 రోజుల ముందే మే 15వ తేదీన ఉదయం 09:00 గం.లకు ఒకేరోజు ఒకే సమయానికి 339 చోట్ల ప్రజల సాక్షిగా 678 మంది పార్టీ నాయకుల, కార్యకర్తల చేత ఒక్కొక్క చోట ఇద్దరు ఉండే విధముగా ప్రారంభోత్సవ మహోత్సవాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. 24వ డివిజన్, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డు లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మునిసిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర పాల్గొంటారు. ఇంతటి అద్భుత అవకాశం నాకు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకుడు నారా లోకేష్, ఓటువేసి 3వసారి ఎమ్.ఎల్.ఏగా చేసిన నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలకు, కష్టం చేసిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలని అన్నారు.

# బీజేపీ వాళ్లకు మోకాళ్ళ లో మెదడు ఉంది.
# బీజేపీ వాళ్ళ బుద్ధి లో మార్పు రావడం లేదు.

## గాంధీ భవన్ లో అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ




**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** అబద్ధాలు ప్రచారం చేయడం లో బీజేపీ వాళ్ళు దిట్ట.నియంత లకు అబద్దాల మీద బాగా ప్రేమ ఉంటుంది.

చాలా జోక్ గా బీజేపీ వాళ్ళు మాట్లాడుతున్నారు.

బీఆర్ఎస్ లో కాంగ్రెస్ ఎందుకు విలీనం అవుతుంది..

ఎన్‌వి‌ఎస్‌ఎస్ ప్రభాకర్ ఎవరి వర్గం నువ్వు...ఈటెల రాజేందర్, బండి సంజయ్,కిషన్ రెడ్డి ఎవరి వర్గం నువ్వు.

కేసీఆర్ తీసి నిన్ను పక్కకు పెట్టినప్పుడు కూడా ఇన్ని మాటలు మాట్లాడలేదు కదా ఈటెల రాజేందర్ .

ఎన్‌వి‌ఎస్‌ఎస్ ప్రభాకర్ ఎవరు చెప్పారు నీకు..జూన్ 2 లేదా డిసెంబర్ లో %ఎతిం% కాంగ్రెస్ లో విలీనం కాకపోతే బీజేపీ నీ రాష్ట్రంలో నిషేధిస్తారా..

మాతో పోరాటం మీకు చేత కావడం లేదా.

బీజేపీ, %ఎతిం

బీఆర్ఎస్ ఒక్కటే అందుకే బీజేపీ నీ రాష్ట్రంలో జనాలు తొక్కి పెట్టారు..

ఎన్‌వి‌ఎస్‌ఎస్ ప్రభాకర్ గతంలో ఇలాగే కారు కూతలు కూశావు అప్పుడు ఏమైందో నీకు తెలుసు..

ఎన్‌వి‌ఎస్‌ఎస్ ప్రభాకర్ నీతో ఎవరు మాట్లాడించారు చెప్పు..

ఈ టర్మ్ కాదు వచ్చే టర్మ్ కూడా రేవంత్ రెడ్డి మళ్ళీ సీఎం అవుతారని బీజేపీ వాళ్లకు క్లారిటీ ఉంది.అందుకే ఇలా మాట్లాడుతున్నారు..

ఎప్పటికీ బీఆర్ఎస్ , కాంగ్రెస్ కలవదు.. అది రాహుల్ గాంధీ చెప్పారు..

బీజేపీ తో బీఆర్ఎస్ కు చీకటి రాజకీయ ఒప్పందం ఉంది..

బీఆర్ఎస్ గెలవని చోట బీజేపీ ఎంపీ లు ఎలా గెలిచారు..

ఆంధ్రా లో బీజేపీ కి బి టీమ్ లు వైసీపీ టీడీపీ జనసేన ఇక్కడ బీఆర్ఎస్

కమలం కాడకు గులాబీ పువ్వు నీ అంటు కట్టారు.

కొడకా అని మిమ్మల్ని అంటే ఊరుకుంటారా..

# కూలిగా మారిన విహెచ్ హనుమంతరావు




**నల్గొండ ప్రజాబలం ప్రతినిధి:** నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య ఉద్యమం ఉద్యమకారుల జ్ఞాపకార్థం మారక స్థూప నిర్మాణానికి హనుమంతరావు కూలీగా మరి కంకర సిమెంట్ను నెత్తిపై మోస్తూ కూలీలతో కలిసి పని చేశారు.

1947లో స్వాతంత్ర వచ్చిన అనంతరం శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో 1948లో కొంతమంది విద్యార్థులు జాతీయ జెండాను ఎగరవేసిన కారణంగా అప్పటి నవాబ్ ప్రైవేట్ సైన్యమైన రజాకారులు జెండా ఎగరవేసిన వారిని ప్రభుత్వ పాఠశాలలో కాల్చి చంపారు వారి జ్ఞాపకార్థం బీహెచ్ హనుమంతరావు ఈ చరిత్రను తెలుసుకొని వారి స్మారకార్థం తుఫాను నిర్మించాలని గత మూడు సంవత్సరాలుగా ఆగస్టు 15వ తేదీన వల్లాల ప్రభుత్వ పాఠశాలకు వచ్చి వారికి నివాళులు అర్పిస్తున్నారు. గత సంవత్సరం మృతి చెందిన వారి మారక తూపాన్ని నిర్మించి రాబోయే తరాలకు వారి త్యాగాన్ని తెలియజేసేలా చేస్తానని తన సొంత డబ్బులతో తూపాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. ఈరోజు సూపర్ నిర్మాణ ఫౌండేషన్ నిర్మాణానికి పీహెచ్ హనుమంతరావు గారు ఇసక కంకర సిమెంట్ను , తట్టలో వేసుకొని కూలీగా పని చేశారు. హనుమంతరావు మోస్తున్న తటలో తక్కువ కంకర కూలీలు వేయడంతో నేను ఇంకా ముసలివాన్ని కాలేదు ఇంకా తట్టలో కంకర వేయండిరా బై అంటూ కట్టనిండా కంకరణ నింపించి నెత్తిపై కంకర తట్ట మోస్తూ ఫౌండేషన్ లో వేశారు. స్వాతంత్ర్య సమరయోధుల స్తూపంలో తాను కూలీగా పని చేసినందుకు గర్వంగా ఉందని హనుమంతరావు అన్నారు ఈ కార్యక్రమంలో ఎంఎ బాసిత్ కాంగ్రెస్ సందేశ్ గ్రామ సర్పంచ్ ఇంతియాజ్ ఎగ్ సర్పంచ్ అశోక్ రెడ్డి శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# రెవిన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి.
## ఇందిరమ్మ ఇండ్ల పనులు, రెవెన్యూ సదస్సుల పరిశీలన.
## రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, రుద్రంగి, ( ప్రజాబలం ),** భూభారతి పథకం కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ పిలుపునిచ్చారు. భూభారతి కింద రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రుద్రంగి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా, ఆయా గ్రామాల్లో సదస్సులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రుద్రంగి మండల పరిధిలోని దేగవత తండాలో రెవెన్యూ సదస్సులు చేపట్టగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణ పరిశీలించారు. అనంతరం ప్రజల భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకువచ్చింది అని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన..

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సూచించారు. రుద్రంగి మండలంలోని గైదిగుట్ట తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను కలెక్టర్ బుధవారం రోజున పరిశీలించారు. ఈ గ్రామం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక కాగా, 44 ఇండ్లు మంజూరయ్యాయని, అందులో23 ఇండ్లు వివిధ దశలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తున్న ఆర్థిక సహాయాన్ని పొందాలని పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, ఎంపీ ఓ సుధాకర్, రెవెన్యూ అధికారులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ ద్వారా నైపుణ్యత అభ్యసన సామర్థ్యం పెంపందించుకోవాలి: జిల్లా పాలనాధికారి రాజర్షి షా

## పట్టణం లోని డైట్ కళాశాల, బొక్కలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల -2 లలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు పరిశీలన.



**అదిలాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి** బుధవారం పట్టణం లోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు, భోధన నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, జీవన నైపుణ్యాల పెంపు కొరకై 5 రోజుల జిల్లా స్థాయి వృత్తంతర శిక్షణా లో భాగంగా డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణలో బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించి శిక్షణలో నేర్చుకున్న ఆరు మండలాల ఉపాధ్యాయులు వివిధ అంశాల పై శిక్షణలో నేర్చుకుంటున్న అంశాల పై నేరుగా అడిగి తెలుసుకున్నారు.

గుణాత్మక విద్య నైపుణ్యత శిక్షణా తరగతులు పరిశీలించిన అనంతరం

కలెక్టర్ మాట్లాడుతూ నిన్నటి నుండి 17 వ తేదీ వరకు 5 రోజులపాటు సాగే ఈ శిక్షణలో జిల్లా రిసోర్స్ పర్సన్ లు మండల రిసోర్స్ పర్సన్ లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు మంచి విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.

గుణాత్మక విద్య శిక్షణ ద్వారా విద్యార్థులకు తరగతి గదుల్లో అభ్యాసన భయం పోగొట్టి మరింత ప్రతిభ, ఫలితాలు సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని తెలిపారు.

అన్ని మండలాల 349 మంది ఉపాధ్యాయులతో జరుగుతున్న ఉపాధ్యాయ నైపుణ్యత శిక్షణ తరగతులను. కలెక్టర్ పరిశీలించి, పలువురు ఉపాధ్యాయులను పాఠశాలలో జరుగుతున్న బోధన అంశాల పై సవివరంగా ప్రశ్నించారు. ఉపాధ్యాయులు ఏ విధంగా పనిచేస్తే మరింత మెరుగైన విద్య అందించవచ్చునని అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులపై ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలన్నారు.

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో గత 3 సంవత్సరాల నుండి ఇంగ్లీష్ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదని, ప్రతీ ఒక్కరూ ఇంగ్లీష్ లో ప్రతీ సబ్జెక్టు పై ప్రావీణ్యం పొంది విద్యార్థులకు బోధన చేయాలని తెలిపారు.

ఈ శిక్షణా లో గైర్హాజర్ అయిన వారికి తప్పనిసరిగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మొదటి, రెండవ విడతలుగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా భవిత సెంటర్, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆంగ్ల భాష,గణితం సబ్జక్ట్స్ పై విద్యార్థులకు మక్కువ పెంచేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లో లెర్నింగ్ లెవెల్ పెంపొందించాలని ప్రత్యేక తరగతులు తీసుకోవాలని తెలిపారు.తెలుగు లాంటి లాంగ్వేజ్ పరీక్షల్లో విద్యార్థులు వెనుకపడకుండ చూసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ఫలితాలననుసరించిన పద్ధతులు 7,8,9 తరగతులలో అనుసరించాలని పేర్కొన్నారు.

అనంతరం బొక్కలగుడ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల -2 ను సందర్శించి రిసోర్స్ పర్సన్, ఉపాధ్యాయులు మొబైల్ షాప్ లో సెల్ ఫోన్లు ఎలా కొనాలి అన్న దానిపై స్క్రిప్ట్ ద్వారా ప్రదర్శించిన తీరును కలెక్టర్ తిలకించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్,, AMO శ్రీకాంత్,సుజిత్ ఖాన్, అజయ్, ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి




**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి** మే 14: సమాజంలో ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్ర కాంత్ రెడ్డి లు అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు, ఎన్.జి.ఓ లతో యు.సి.డి విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్ జెండర్ ల సేవలను జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలలో వినియోగించే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ... ట్రాన్స్ జెండర్ ల ఆసక్తి, అర్హతల మేరకు జీహెచ్ఎంసీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టే చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా ఇతర విధాల ఉపాధి పొందడానికి వారికి శిక్షణలు కూడా ఇస్తారని తెలిపారు.

యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ... గౌ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీలో పలు ఉద్యోగ అవకాశాలు, ట్రాన్స్ జెండర్ వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి నిర్ణయమని, అందుకు తమ తమ విద్యా అర్హతలు, నైపుణ్యత, ఆసక్తుల మేరకు అనువైన రంగాన్ని ఎంచుకోవాలని, దానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు కు అర్హత లేని ట్రాన్స్ జెండర్లను స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థిక ఎదుగుదలకు దోహద పడే విధంగా కూడా జిహెచ్ఎంసి కృషి చేస్తుందన్నారు ఇప్పటికే మూడు ట్రాన్స్ జెండర్ ల ఎస్.హెచ్.జి గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు లింకేజీ లభించే విధంగా చర్యలు



తీసుకుంటున్నట్లు తెలిపారు. మరిన్ని ఎస్.హెచ్.జి గ్రూప్ ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు.

అదేవిధంగా వివిధ ఎన్.జీ.ఓ ల ద్వారా పలు రంగాల్లో శిక్షణనిచ్చి స్వయం ఉపాధికి చేయుతనివ్వనున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్, క్లీన్ డ్రైవ్ అమలులో గ్రీన్ మార్షల్స్, పార్కులు, హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ అండ్ ఎస్.బి రిజర్వాయర్ల వద్ద, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్ లుగా, మెట్రో స్టేషన్ లో ఉద్యోగ అవకాశాలు, అమృత్ స్కీం కింద నీటి నాణ్యత పరీక్షలో సహకారం, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో ప్యారా మెడికల్ గా ఉపాధి పొందే అవకాశం ఉందని, అర్హత గల వారందరిని భర్తీ చేస్తామన్నారు.

స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు మాట్లాడుతూ... స్పోర్ట్స్ విభాగంలో ఎలాంటి విద్యార్హత లేని అభ్యర్థుల నుండి అత్యధిక విద్యార్హతలు ఉన్న వారి వరకు పలు రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆయా వివరాలను వివరించారు.

సమావాశానికి హాజరైన ట్రాన్స్ జెండర్ ఎన్.జి.ఓ లు పలువురు ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అందిస్తున్న శిక్షణలను వారికి వివరించారు. ఆయా శిక్షణ సంస్థలు ఇస్తున్న ట్రైనింగ్స్, మార్కెట్ లింకేజి తదితర విషయాలను వివరించారు.

పలువురు ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు వారి వారి అభిప్రాయాలను తెలియజేయడంతో పాటు ఉద్యోగ ఉపాధి తో జీవనోపాధికి సంబంధించిన వివిధ అంశాల పై గల సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్.పి శ్రీనివాస్, హార్టికల్చర్ ఆఫీసర్ డా. సునంద, అడ్మినిస్ట్రేషన్ జె.సి శ్రీనివాస్, ఎన్.జి.ఓ లు, వివిద ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com